చైతన్యరథం



## అమరావతికి చేరిన సీఎం చంద్రబాబు నాయుడు

తిరుపతి (చైతన్య రథం): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. సోమవారం సాయంత్రం అమరావతికి తిరుగు పయనమయ్యారు. సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న అనంతరం నారావారిపల్లె నుంచి సాయంత్రం 4 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న సీఎం చంద్రబాబు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి అమరావతికి పయనమయ్యారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, డిఐజీ షిమోషి బాజ్ పాయ్, ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, చంద్రగిరి, శ్రీకాళహస్తి, పలమనేరు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, అమర్నాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వీడ్కోలు పలికారు.



# కనకదాస బోధనలు నేటికీ అనుసరణీయం

### 'ఎక్స్' వేదికపై శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): సమాజంలో మార్పు సాధించేందుకు సంఘ సంస్కర్త, కవి, గాయకుడు, కృష్ణతత్వ భక్తుడు గురు కనకదాస బోధనలు అనసరణీయమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కనకదాస జయంతి సందర్భంగా 'ఎక్స్' వేదికగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కర్ణాటకలో జన్మించిన గురు కనకదాస సమాజంలో మార్పు తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశారన్నారు. 'రాయలసీమ లోనూ కుల వ్యవస్థ, అసమానతలపై చైతన్యం తీసుకొచ్చిన సామాజిక తత్వవేత్త కనకదాస. బీసీలు, వారి సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ, వారి ఉన్నతి కోసం ప్రతి ఒక్కరూ పని చేయాల్సిన అవసరం గుర్తు చేసిన మహనీయుడు ఆయన' అని 'ఎక్స్' పోస్టులో పేర్కొన్నారు. భక్తిమార్గంలో ఆయన చేసిన బోధనలు నేటికీ అనుసరణీయమన్నారు. ప్రజలకు అర్థమయ్యే రీతిలో సరళమైన భాషలో ఆయన ఎన్నో ఏళ్లకిందట చేసిన బోధనలు ఈనాటి సమాజానికీ మార్గదర్శనం చేస్తున్నాయంటే ఆ మహనీయుడి దార్శనికతను అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. గురు కనకదాస బోధనలు సమాజాన్ని సక్రమ మార్గంలో నడిపించేందుకు ఉపకరిస్తాయని మనస్ఫూర్తిగా నమ్ముతున్నానంటూ, అందుకే కనకదాస జయంతిని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని సీఎం 'ఎక్స్' పోస్టులో స్పష్టం చేశారు.

# వైసీపీ భూ రాబందుల పనిపడతాం

### - అసెంబ్లీలో మంత్రి అనగాని

అమరావతి (చైతన్యరథం): వైసీపీ భూ రాబందుల పని పడతామని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఉద్ఘాటించారు. అసెంబ్లీలో సోమవారం జగన్ హయాంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల వ్యవహారంపై చర్చ సాగింది. జగనన్న ఇళ్ల పేరుతో పేదలకు అప్పట్లో భూములు ఇచ్చేందుకు ప్రభుత్వం భారీగా భూములు కొనుగోలు చేసింది. ఈ క్రమంలో భారీ అవినీతి జరిగిందని.. ప్రభుత్వం భూములు కొంటుందని తెలిసిన వైసీపీ నాయకులు ముందుగానే భూములు కొనేసి.. తర్వాత వాటిని ప్రభుత్వానికి ఎక్కువ రేటుకు అమ్మి భారీ ఎత్తున సొమ్ములు చేసుకున్నారని గోరంట్ల బుచ్చయ్య చౌదరితో పాటు పలువురు టీడీపీ సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. వైసీపీ నేతలు రాబందులుగా మారి.. పేదల పేరుతో



ప్రభుత్వ సొమ్మును దోచేశారని ధ్వజమెత్తారు. అసైన్డ్ భూములు కూడా తక్కువ ధరలకు కొనేసి ప్రభుత్వానికి అధిక ధరలకు విక్రయించారని తెలిపారు. 9 లక్షల పై చిలుకు అసైన్డ్ భూముల్లో వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలు జరిగాయన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామసభలు పెట్టి అభ్యంతరాలపై చర్చిస్తామని తెలిపారు. భూములు దోచుకున్న వైసీపీ రాబందులపై చర్యలు తప్పవని మంత్రి అనగాని హెచ్చరించారు. అదేసమయంలో తప్పుచేసిన అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి అనగాని స్పష్టం చేశారు. సభలో వైసీపీ ఎమ్మెల్యేలు లేకపోయినా.. ఒకరిద్దరు టీడీపీ నాయకులే విపక్ష పాత్ర పోషించారు. జగనన్న ఇళ్లలో ఎక్కడెక్కడ ఎలాంటి తప్పులు జరిగాయో వివరించాలని వారు కోరారు. దీంతో మంత్రి.. ఆయా వివరాలను జిల్లాల వారీగా తెలిపారు. అన్నమయ్య, చిత్తూరు, అనంతపురం, శ్రీకాకుళం, గుంటూరు జిల్లాల్లో భూముల అక్రమాలు ఎక్కువగా జరిగాయని చెప్పారు.

# ఇమామ్‌లు, మౌజమ్‌లకు గౌరవ వేతనాలు కొనసాగిస్తాం

### - మండలిలో మంత్రి ఫరూక్



అమరావతి: ఇమామ్‌లు, మౌజమ్‌లకు గౌరవ వేతనాలను కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందని మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల్లో సోమవారం పలువురు ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఇమామ్, మౌజమ్‌లకు గౌరవ వేతనాలను గతంలో టీడీపీ ప్రభుత్వమే ప్రారంభించిదని గుర్తుచేశారు.

ముస్లింలు హజ్ యాత్రకు వెళ్తే ఇచ్చే ఆర్థిక సాయాన్ని కొనసాగిస్తామన్నారు. గతంలో యాత్రకు వెళ్లి వచ్చినవారికి ఇవ్వాల్సిన పెండింగ్ నిధులను కూడా మంజూరు చేస్తామని చెప్పారు. విజయవాడ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారికి మాత్రమే రూ. లక్ష అందజేస్తామని ఫరూక్ తెలిపారు.

### తప్పుడు నివేదికలు ఇచ్చిన

# అధికారులపై చర్యలు

### - స్పీకర్ అయ్యన్న ఆదేశం



అమరావతి (చైతన్యరథం): జగనన్న కాలనీల్లో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. సోమవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు గృహనిర్మాణశాఖపై మాట్లాడారు. టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ విశాఖపట్నంలో అక్రమాలు జరిగాయని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం స్పీకర్ అయ్యన్న స్పందిస్తూ అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలన్నారు. అధికారులు ఇచ్చే నివేదికలకు, వాస్తవ పరిస్థితులకు చాలా తేడా ఉంటోందన్నారు. తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని.. అలా చేస్తే మిగిలిన వారు తప్పులు చేయరన్నారు. ఈ మేరకు మంత్రి పార్థసారథికి స్పీకర్ సూచించారు.

మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ... జగనన్న కాలనీలపై విచారణకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ఆదేశించారని తెలిపారు. జగనన్న కాలనీలపై శాఖాపరమైన విచారణతో పాటు విజిలెన్స్ విచారణ కొనసాగుతోందని చెప్పారు.

### క్లిష్ట సమయంలో

# అండగా పెదనాన్న, పెద్దమ్మ

### - నారా రోహిత్ భావోద్వేగం



అమరావతి (చైతన్యరథం): క్లిష్ట పరిస్థితుల్లో పెదనాన్న, సీఎం చంద్రబాబు, పెద్దమ్మ భువనేశ్వరి ఎంతో అండగా నిలిచారని సినీ నటుడు నారా రోహిత్ కృతజ్ఞతలు తెలిపారు. నారా రోహిత్ తండ్రి, సీఎం చంద్రబాబు సోదరుడు రామ్మూర్తినాయుడు గత శనివారం మృతి చెందిన సంగతి తెలిసిందే. స్వగ్రామం నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు అన్నీ తానే అయి ఆదివారం రామ్మూర్తినాయుడి అంత్యక్రియలు జరిపించారు. ఈ సందర్భంగా నారా రోహిత్ తన పెదనాన్న చంద్రబాబు, సన్నిహితుల గురించి ఎక్స్ వేదికగా భావోద్వేగంతో స్పందించారు.

తన తండ్రి మృతితో తమ కుటుంబం విషాదంలో మునిగిపోయిన వేళ తమకు అండగా నిలిచిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. క్లిష్ట సమయంలో ఎంతో మద్దతు ఇచ్చారని చెప్పారు. తండ్రి మరణంతో కుటుంబం దిగ్భ్రాంతికి గురైన వేళ మీ మాటలు మాలో ఎంతో ధైర్యాన్ని నింపాయని అన్నారు. అడుగడుగునా అండగా నిలబడ్డ పెదనాన్న, పెద్దమ్మ లోకేశ్ అన్న, బ్రాహ్మణి వదినకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని చెప్పారు.

ముప్పైయేళ్ల చంద్రన్న స్మార్ట్ అండ్ హార్డ్‌వర్క్

# అభివృద్ధి.. సంక్షేమం.. సామాజిక న్యాయానికి పట్టం

సెప్టెంబరు 1, 1995న శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు ముఖ్యమంత్రిగా తొలుత బాధ్యతలు చేపట్టి సెప్టెంబరు 1, 2024 నాటికి 30వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంలో.. మహోజ్వల విజయాలు కొన్ని.

## విజనరీ లీడర్ మన చంద్రన్న




## పింఛన్లు ప్రారంభించింది ఎన్‌టిఆర్...
## పెద్ద మొత్తం పెంచింది చంద్రన్న

1. నాడు ఎన్‌టిఆర్ రూ.30తో పింఛన్ ప్రారంభిస్తే, చంద్రన్న దాన్ని రూ.75కి, తరువాత రూ.200 నుండి రూ.2000 కి, ఆపై రూ.4000 పెంచింది చంద్రన్నే.
2. రూ.1000 పింఛన్ పెంచడానికి జగన్ 5 ఏళ్ళు జాప్యం చేశారు.
3. చంద్రన్న ఒక్క నెలలోనే రూ.1000 పెంచి రూ.4000 ఇస్తున్నారు.
4. దివ్యాంగుల పింఛన్ రూ.4000 నుండి రూ.6000 లకు పెంపు
5. పూర్తిస్థాయి అంగవైకల్యానికి గురైన వారికి రూ.10 వేల నుండి రూ.15 వేలకు పెంపు
6. కిడ్నీ, తలసీమియా వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10 వేల పింఛన్
7. రాష్ట్రంలో 65.31 లక్షల మందికి పింఛన్లు ఇండ్ల వద్దే పంపిణీ







# వర్ధెల్లి మురళి అబద్ధాల కుతంత్రం - 2

01. 11. 2024 ఆదివారం అవినీతి పత్రిక 'సాక్షి'లో తన నేత లక్షణాల్ని చంద్రబాబుకు అంటగడుతూ అబద్ధాలతో వర్ధెల్లి మురళి సుదీర్ఘ వ్యాసం రాశారు. వివేకానందరెడ్డిని క్రూరాతిక్రూరంగా నరికి చంపి.. చిన్నమ్మ తాళి తెంచినోళ్లు మారీచులౌతారుగాని, టీడీపీ వారు ఎలా మారీచులౌతారో మురళి చెప్పాలి. రాష్ట్రంలో ముందెన్నడూ లేని క్విడ్‌ప్రోకోను తెరపైకి తెచ్చి అవినీతి సొమ్ముతో 'సాక్షి' మీడియాను స్థాపించి అబద్ధాలు, విద్వేషాలు కుమ్మరించడం మారీచమౌతుంది. 2004కు ముందు రూ.2 కోట్లలోపు ఆస్తివున్న మీ యజమాని నేడు లక్షల కోట్లకు అమాంతం ఎగబాకడం మారీచం కాదా? తల్లిని, చెల్లిని కోర్టుకు ఈడ్చడం మారీచం కాదా? మద్య నిషేధం చేస్తామన్న హామీపై మాట తప్పి, మడమతిప్పి రూ.వేల కోట్లు దోపిడీ కోసం విషపూరిత మద్యం పోసి 30 వేలమంది పేదల ప్రాణాలు మద్యం మహమ్మారికి బలిపెట్టడం మారిచం కాదా? ఈ మీ లక్షణాల్ని కూటమికి అంటగట్టి అబద్ధాలు రాస్తే ఇంకా నమ్మడానికి ప్రజలు అమాయకులేం కాదు. అబద్ధాలు, విద్వేష రాజకీయాలను కట్టిపెట్టి నిర్మాణాత్మక రాజకీయాలవైపు మారకపోతే వైకాపా కనుమరుగు కాక తప్పదు.

మహిళల శీల హననం చేసిన అపర దుశ్శాసనులపై కేసులు పెట్టడం భావ ప్రకటనా స్వేచ్ఛకు సంకెళ్లు వేయటం ఎలా అవుతుంది? హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులపై తప్పుడు పోస్టులు పెట్టిన దుర్మార్గులపై కేసులు పెట్టి అరెస్టు చేయడం భావప్రకటనా స్వేచ్ఛకు భంగం కాదు. వర్రా రవీంద్రారెడ్డి శీల హనన పోస్టులు పెట్టలేదని వెనకేసుకు రావడం సరైందికాదు. 55మందిని అరెస్టు చేశారని వాపోతున్న మీరు.. ఆనాడు 2,500మంది అమరావతి రైతులు, దళితులు, మహిళల్ని అక్రమ కేసుల్లో ఇరికించి.. హింసించడంపై ఏం సమాధానం చెబుతారు? ఎంపీ రఘురామ కృష్ణంరాజును జ్యుడీషియల్ టార్చర్ చేసిందాన్ని నాడు సాక్షి ఎలా సమర్ధించింది? మాస్క్ అడిగిన డాక్టర్ సుధాకర్‌ను నడిరోడ్డుపై బట్టలిప్పి, చేతులు విరిచికట్టి పిచ్చివాడని ముద్ర వేసి ఆయన చావుకు కారణమైనదానికి ఏం సమాధానం చెబుతారు? మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్‌పై నీలాపనిందలు, అక్రమ కేసులతో హింసించి ఆయన ప్రాణం తీయలేదా? భువనమ్మను నిండు సభలో అవమానపరుస్తుంటే నాడు జగన్ నివారించకపోగా.. దుర్యోధనానందం పొందింది వాస్తవం కాదా? అలిపిరి ల్యాండ్ మైన్ బ్లాస్ట్‌లో కంటతడి పెట్టని చంద్రబాబు.. ఉత్తమ ఇల్లాలిపై నిందలు వేస్తుంటే మనసు వికలమై వెక్కి వెక్కి ఏడ్చారు. దీన్ని కూడా వెటకారం చేసి నీచ స్థితికి దిగజారారు. పాషాణ హృదయం ఉన్న వారే తల్లి, చెల్లిపై నిందలు వేస్తున్నా వెనకేసుకొస్తారు.

ఐదేళ్లలో 2.73 లక్షల కోట్ల ప్రజాధనాన్ని ప్రజల చేతికి చేర్చడమే టీడీపీ దృష్టిలో విధ్వంసపాలన కాబోలు అంటూ మురళీ వెటకారమాడారు. ధరలు, పన్నులు, చార్జీల బాదుడుతో 5 లక్షల కోట్ల పేదల కష్టార్జితాన్ని దోచుకున్నారు. 10 లక్షల ఎకరాల అసైన్డ్ భూముల కబ్జాకు కుట్ర చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సబ్ ప్లాన్ నిధులు లక్షల కోట్లు దారి మళ్లించి సామాజిక న్యాయం గొంతు కోయడం విధ్వంసం కాదా? వెయ్యి రూపాయల పింఛన్ పెంచడానికి ఐదేళ్లు సాగదీసి పేదల్ని మోసం చేశారు. చంద్రబాబు ఇప్పుడు ఒకేసారి వేయి రూపాయలు పెంచి 4 వేలు ఇస్తున్నారు. 2014-19 మధ్య 2 విడతల్లోనే రూ.2 వేలు పింఛన్లు పెంచారు. పింఛన్లపై వైకాపాది గోబెల్స్ ప్రచారమే. సచివాలయాల ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసి 15వేల మినీ రాజధానులు చేశామని డబ్బా కొట్టుకున్నారు. సర్పంచులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు లాంటి లక్షలాది ఎన్నికైన ప్రజా నాయకుల్ని డమ్మీలు చేసి వాలంటీర్లను పెట్టడం గ్రామ స్వరాజ్యాన్ని ధ్వంసం చేయడమే అవుతుంది. కేంద్రం పంపిన రూ.12 వేల కోట్ల నిధుల్ని స్థానిక సంస్థలకు ఇవ్వకుండా దారి మళ్లించడం గ్రామ స్వరాజ్యాన్ని ధ్వంసం చేయడమే. ఉపాధి హామీని, జల్ జీవన్ మిషన్, రోడ్ల నిర్మాణాన్ని నీరుగార్చడం గ్రామ స్వరాజ్యాన్ని ధ్వంసం చేయడమేగాని మినీ రాజధానుల్ని సాకారం చేయడం కాదు. పొరుగు రాష్ట్రాలకు ధీటుగా ప్రజా రాజధాని నిర్మాణం తిరిగి సాగుతుంటే, దానిపై విద్వేషం రెచ్చగొట్టడాన్ని ఇకపై ప్రజలు సహించరు. కుల, ప్రాంతీయ చిచ్చును నమ్ముకొని రాజకీయం చేయాలనుకుంటే వైకాపా భవిష్యత్తు ప్రశ్నార్ధకమౌతుంది.



- గురజాల మాల్యాద్రి
చైర్మన్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

## ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్నా పోటీకి అర్హులే

- పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిబంధనలు మారుస్తూ చట్ట సవరణ
- ఏపీ మున్సిపల్ చట్ట సవరణ బిల్లు 2024కు అసెంబ్లీ ఆమోదం
- జనాభా వృద్ధి రేటు పెంపుదలలో భాగంగానే చట్టంలో మార్పులు



అమరావతి(చైతన్యరథం): ఇకపై ఇద్దరి కంటే ఎక్కువమంది పిల్లలున్నా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేలా ఏపీ మున్సిపల్ చట్టాల సవరణ బిల్లు 2024కు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును నాలుగురోజుల క్రితమే పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రి పొంగూరు నారాయణ సభలో ప్రవేశపెట్టారు. తాజాగా సోమవారం బిల్లు ఆమోదం కోసం ఆయన ప్రతిపాదించిన వెంటనే ఎలాంటి చర్చా లేకుండా దానే ఆమోదం పొందింది. మున్సిపల్ చట్టాల సవరణ బిల్లు గత నేపథ్యాన్ని పరిశీలిస్తే 1960 దశకంలో జనాభా నియంత్రణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుటుంబ నియంత్రణ పథకాలు ప్రవేశపెట్టాయి. కుటుంబ నియంత్రణ లో భాగంగా తీసుకున్న నిర్ణయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో భాగంగా పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్న వారిని అనర్హులుగా చేస్తూ చట్టంలో సవరణలు చేశారు. 1955 మున్సిపల్ కార్పొరేషన్ల చట్టంలోని సెక్షన్ 21 బీ, అలాగే 1965 మున్సిపాలిటీల చట్టంలోని సెక్షన్ 13బీలను చొప్పిస్తూ ఏపీ మున్సిపల్ శాస నాల సవరణ బిల్లు 1994ను తీసుకొచ్చారు. 1994లో జరిగిన ఈ సవరణల ప్రకారం ఇద్దరికంటే ఎక్కువ మంది సంతానం కలిగి ఉన్న వారు పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులు. అప్పటినుంచి ఇదే విధానం కొనసాగుతూ వస్తుంది. అయితే గత మూడు దశాబ్దాలలో జనాభా నియంత్రణ కోసం తీసుకున్న చర్యలతో సంతానోత్పత్తి సామర్థ్యం రేటు బాగా తగ్గిపోయింది. 2001లో 2.6నుంచి 1.5కు తగ్గిపోయింది. జనన,మరణాల నిష్పత్తిలో ఆంధ్రప్రదేశ్ బాగా వెనుకబడి పోయింది. అదే సందర్భంలో జనాభావృద్ధి రేటు బాగా తగ్గి పోయింది. వృద్ధుల జనాభా రేటు ఎక్కువగా ఉంది. మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా జనాభా పెరుగుదల ఆవశ్యకత అవసరం ఎంతైనా ఉందన్న ఉద్దేశంతోనే చట్టంలో సవరణ లు చేయాల్సి వచ్చింది. దీని ప్రకారం గతంలో ఆయాచట్టాల్లో చేసినసవరణలకు సంబంధించిన సెక్షన్‌లను తొలగిస్తూ ఏపీ మున్సిపల్ శాసనాల చట్ట సవరణకు అసెంబ్లీ ఆమోదముద్ర వేసింది.

## ఆర్జీవీకి హై కోర్టులో చుక్కెదురు

- క్వాష్ పిటిషన్ కొట్టివేత
- అరెస్ట్ నుండి రక్షణకూ నిరాకరణ

అమరావతి (చైతన్యరథం): దర్శకుడు రామ్ గోపాల్‌వర్మకు ఏపీ హైకోర్టులో చుక్కెదురయింది. ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ వర్మ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. అరెస్టు నుంచి రక్షణ కల్పించేందుకు కూడా నిరాకరించింది. దీంతో ఆర్జీవీని అరెస్టు చేయడానికి పోలీసులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పోయినట్లయింది. పిటిషనర్‌కి నోటీసులు జారీ అయ్యాయని, అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలంటూ వర్మ న్యాయవాది చేసిన అభ్యర్ధనను న్యాయస్థానం తోసిపుచ్చింది. అరెస్టుపై ఆందోళన ఉంటే బెయిల్ పిటిషన్ వేసుకోవాలని స్పష్టం చేసింది. పోలీసుల విచారణకు మరికొంత సమయమివ్వాలని ఆర్జీవీ విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఉన్నత న్యాయస్థానం.. ఈ అభ్యర్ధన పోలీసుల ముందు చేసుకోవాలని, కోర్టు ముందు కాదని వ్యాఖ్యానించింది.

గతంలో వ్యూహం సినిమా విడుదల సమయంలో చంద్రబాబు, పవన్ వ్యక్తిత్వాలను కించపరిచేలా ఆర్జీవీ పోస్టులు పెట్టారు. దీనిపై టీడీపీ మద్దిపాడు మండల ప్రధాన కార్యదర్శి రామలింగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత కూడా వర్మ అసభ్య పోస్టింగ్‌లు మానుకోలేదు. తాజాగా సోషల్ మీడియా కీచకులపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఈ క్రమంలో ఆర్జీవీపైనా కేసు నమోదయింది.

## ఉచిత గ్యాస్‌పై విపక్షాల విషప్రచారం

- ఇప్పటి వరకూ 40 లక్షల మంది బుకింగ్
- 30 లక్షల మందికి సిలిండర్ల డెలివరీ
- సమర్ధవంతంగా పథకం అమలు
- అర్హులందరికీ ఏడాదికి మూడు సిలిండర్లు
- మండలిలో మంత్రి నాదెండ్ల మనోహర్



అమరావతి (చైతన్యరథం): లబ్ధిదారుల జీవితాల్లో దీపం-2 పథకం ద్వారా వెలుగులు నింపాలనే దృఢ నిశ్చయంతో కూటమి ప్రభుత్వం ఉందని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఇది గిట్టని విపక్షాలవారు అపోహల ద్వారా ప్రజల జీవితాలు అంధకారంలోకి నెట్టాలనే దురుద్దేశ్యంతో విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సోమవారం శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీమేరకు దీపావళి కానుకగా దీపం-2-పథకం అమలుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. గత అక్టోబర్ 31వ తేదీన సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శ్రీకాకుళం జిల్లాలో దీపం పథకాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో ఉన్న ఒక కోటి 55లక్షల మంది గ్యాస్ కార్డు దారులకు అర్హత కల్పించేవిధంగా ఈ పథకం రూపొందించామన్నారు.

దీపం-2 పథకానికి రూ.2,684 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతకు అయ్యేఖర్చు రూ.894 కోట్ల మొత్తాన్ని పెట్రోలియం సంస్థలకు అందజేసిందన్నారు.

దీపం కింద అర్హులైన కుటుంబాల వారు తమ మొదటి సిలిండర్ పొందడం కోసం గత నెల 29వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వ తేదీ వరకూ బుక్ చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ఉచిత సిలిండర్ కావాల్సిన వారు సాధారణ పద్ధతిలో ముందుగా సొమ్ము చెల్లించవలసి ఉంటుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో బుక్‌చేసిన వారికి 24 గంటల లోపు, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల లోపు గ్యాస్ డెలివరీ ఇస్తారని వివరించారు. ఆ తర్వాత సిలెండర్ డెలివరీ అయిన 48 గంటల్లోపు చెల్లించిన పూర్తి సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో తిరిగి జమ చేస్తారని చెప్పారు. వీటిని ఒకేసారి కాకుండా నాలుగు నెలలకు ఒకసారి బుక్ చేసుకునే అవకాశం కల్పిస్తారన్నారు.

దీపం పథకం కింద ఏడాదికి మూడు సిలిండర్లు పొందేందుకు ముందు ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ కలిగి ఉండాలన్నారు. అలాగే రేషన్ కార్డు, చెల్లుబాటయ్యే ఆధార్ కార్డు ఉండాలన్నారు.

ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో అనుసంధానం చేసి ఉండాలన్నారు. 1967 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేసి పూర్తి సమాచారం తెలుసుకోవచ్చన్నారు. ఈ పథకాన్ని ఇంత పకడ్బందీగా అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదని విపక్ష సభ్యులకు హితవు పలికారు.

# రాష్ట్రంలో బీసీలకు స్వర్ణయుగం మొదలైంది

- టీడీపీ హయాంలోనే వారికి ఉన్నత గుర్తింపు దక్కింది
- విద్యావంతులై వ్యాపారవేత్తలు కావాలన్నదే చంద్రబాబు లక్ష్యం
- కురుబలను రాజకీయంగా, ఆర్థికంగా అన్నివిధాలా ఆదుకున్నారు
- అధికారికంగా భక్త కనకదాస జయంత్యుత్సవాలు హర్షణీయం
- బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత



అనంతపురం(చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో బీసీలకు స్వర్ణయుగం మొదలైందని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. అనంతపురం గుత్తి రోడ్డులోని కె.టి.ఆర్ కన్వెన్షన్ హాలులో సోమవారం శ్రీభక్త కనకదాస రాష్ట్రస్థాయి జయంతోత్సవాలను ఆమె ప్రారంభించా రు. మంత్రితో పాటు అనంతపురం, హిందూపురం ఎంపీలు అంబిక లక్ష్మీనారాయణ, బి.కె.పార్థసారథి, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ పోలా భాస్కర్, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ సంచాలకులు, మేనేజింగ్ డైరెక్టర్ ఎ.మల్లికార్జున, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న తదితరులు పాల్గొన్నారు. ముందుగా కనకదాస చిత్రపటానికి వారంతా పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భం గా మంత్రి సవిత మాట్లాడుతూ శ్రీ భక్త కనకదాస రాష్ట్రస్థాయి జయంతోత్సవాలను అధికారికంగా నిర్వ హించేలా ఆదేశాలిచ్చిన ముఖ్య మంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కు శిరస్సు వంచి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. జయంతోత్సవాలను విజయవంతం చేసిన కురుబ కుల బాం ధవులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బీసీలు ముందుండాలన్నదే చంద్రబాబు లక్ష్యం

ముఖ్యమంత్రి చంద్రబాబు కురుబలను రాజకీయం గా,ఆర్థికంగా ముందుకు తీసుకువచ్చి ఎంతగానో ఆదు కున్నారన్నారు. నాడు ఎన్టీఆర్ ఈ జిల్లాలో రామ చంద్రయ్యకు మంత్రి పదవి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. బీసీలను గుర్తించి వారు అన్ని రంగాల్లో ముం దుండాలని కోరుకునేది తెలుగుదేశంపార్టీ అన్నారు. నేడు జిల్లాలో రెండు ఎంపీ స్థానాలను కురుబలకు కేటాయించారని, ఎమ్మెల్యేగా నాకు అవకాశం ఇచ్చి మంత్రిని చేసి బీసీ సంక్షేమ శాఖ కేటాయించారన్నారు. బీసీలను చైతన్యవంతులు కావాలని, రాష్ట్రంలో బీసీలకు స్వర్ణయుగం మొదలైందందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కన కదాస జయంతోత్సవాలు ప్రతి జిల్లా కేంద్రంలో చేయా లని రూ.12.50కోట్ల నిధులు ముఖ్యమంత్రి కేటాయిం చారన్నారు. భక్త కనకదాసు అందరూ సంయుక్తంగా ముందుంటే ఏదైనా సాధించవచ్చని చెప్పారని, ఊరూ రా కీర్తనలు చేశారని తెలిపారు.

కురుబ సామాజిక వర్గంలో కనకదాసుకు గుర్తింపు గర్వ కారణమన్నారు. బీసీలు, బలహీనవర్గాల వారికి తెలుగుదేశం పార్టీ బ్యాక్ బోన్ అని చంద్రబాబు చెప్పారని, తన కూటమి ప్రభుత్వానికి ఎన్నికల్లో ఓటు వేసి గెలిపిం చినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. విద్యావంతులై ప్రతి బీసీ వ్యాపారవేత్త కావాలన్నదే ఆయన లక్ష్యమన్నారు. కురుబలు షీఫామ్ పెట్టుకుని వ్యాపారాలు చేస్తున్నారని, వారికి రూ.50 లక్షల వరకు ప్రతి యూనిట్‌కు రుణాలు ఇవ్వడం జరు గుతుందన్నారు. యూనిట్‌కు రూ.5 లక్షల నుంచి రూ.కోటి వరకు బీసీ సంక్షేమ శాఖ తరపున ఇచ్చే అవకాశం ఉందన్నారు. అందులో 10 శాతం లబ్ధిదారుని వాటా, 40 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంకు రుణం వస్తుందని తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు నిధులు లేవని, అవి ఉత్సవ విగ్రహాలుగా మారాయన్నారు. ప్రస్తుతం కార్పొరేషన్లకు వెయ్యి కోట్ల వరకు నిధులు ఇవ్వడం జరిగిందని, బీసీలు అని రంగాల్లో ముందుండాలని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కంకణం కట్టు కున్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం, అభ్యర్థులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. టీటీడీలో బోర్డ్ మెంబర్‌గా కురుబలకు అవకాశం ఇవ్వడం జరుగుతుందని, శ్రీశైలం లో బోర్డ్ మెంబర్‌గా కురుబలకు ఇస్తామన్నారని తెలిపారు. బీసీ బిడ్డలు విద్యా వేత్తలుగా, వ్యాపారవేత్తలుగా ఎదగాలని, వారికి స్థానిక ఎన్నికల్లో ప్రాధాన్యం కావాలని అడిగారని, కూటమి ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో ఖచ్చితంగా ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పారు.

## కురుబ కనకదాస కళ్యాణ మండపానికి రూ.20 లక్షలు

**- అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ**

సామాన్య కుటుంబంలో జన్మించి కుల వివక్షతకు వ్యతిరేకంగా శ్రీ భక్త కనక దాస పోరాదారు. సమాజం లో అందరూ సమానమని, అందరూ మంచి మిత్రులు గా మెల గాలని కాంక్షిం చారు. సమాజానికి కనకదాస మార్గోపదేశం చేశారు. కురుబలకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది. ఇంతకుముందు ఎవరూ అలా ప్రాధా న్యం ఇవ్వలేదు. తమను ఎన్నికల్లో గెలిపించిన వాల్మీకులు, కురుబ సామాజికవర్గాల వారికి పాదాభివందనం చేస్తున్నాం. కురుబలకు మంచి భవిష్యత్తు ఉంటుంది. కురుబ కనకదాస కళ్యాణ మండపం కోసం ఎంపీ నిధుల నుంచి రూ.20 లక్షలు కేటాయిస్తాం.

## కురుబలకు చంద్రబాబు రాజకీయ ప్రాధాన్యం

**- అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**

శ్రీ భక్త కనకదాస రాష్ట్రస్థాయి జయంతోత్సవాలను అనంతపురంలో జరుపు కోవడానికి అవకాశం ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కురుబలకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించారు. పెనుగొండ నుంచి ప్రాతినిధ్యం వహించిన సవితమ్మకు మంత్రి పదవి, హిందూపురం పార్లమెంట్‌కు ఎంపీగా పార్థసారథికి అవకాశం కల్పించారు. కనకదాసు 1509లో జన్మించారు..సామాన్యులకు కూడా అర్థమయ్యేలా ఆయన రచనలు చేశారు.. కృష్ణ భక్తుడిగా తన జీవితాన్ని దైవానికి అంకితం చేశారు. సమాజంలో వివక్షతకు వ్యతి రేకంగా పోరాడి కురుబల ఆరాధ్య దైవంగా నిలిచారు. కురుబలకు అత్యధిక ప్రాధా న్యత ఇస్తూ వారి సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేస్తోంది.

## గొర్రెల యూనిట్లు, రుణాలతో కురుబలను ఆదుకోవాలి

**- మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత**

పరిటాల కుటుంబం మొదటి నుంచి కురుబలకు అండగా ఉంటోంది. వారు కూడా కష్టకాలంలో తమ వెన్నంటే నడిచారు. పరిటాల రవి మొదటి నుంచి కురుబ కులస్థులకు ఏ కష్టం వచ్చినా అండగా నిలిచారు. ఆయన మరణాంతరం మా కుటుంబానికి కురుబలు అండగా నిలిచారు. ఒకప్పుడు పార్థసారథిని జడ్పీ చైర్మన్‌ను చేయడంతో పాటు..ఇంకా ఎంతోమంది కురుబలకు స్థానిక సంస్థల్లో అవకాశం కల్పించిన వ్యక్తి



పరిటాల రవి. ఆ రోజుల్లో రామచంద్రయ్య వంటి వారిని ఎన్టీఆర్ మంత్రిగా చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా కురుబలకు ప్రాధాన్యమిస్తూ.. వారికి అండగా నిలిచారు. చంద్రబాబు చొరవతోనే ఈ రోజు రాష్ట్రస్థాయిలో అధికారికంగా భక్త కనకదాసు జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారు. మరోవైపు రాప్తాడు నియోజకవర్గంలో కురుబలు ఎక్కువగా ఉన్నారు..వారికి ప్రధానమైన వృత్తి గొర్రెల పెంపకం. ఇటీవల గొర్రెలు వ్యాధుల బారిన పడి చనిపోతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. అందుకే గొర్రెలకు ఇన్స్యూరెన్స్ చేయించే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. మరోవైపు మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి ప్రత్యేకంగా చొరవ తీసుకుని..జిల్లాకు మరీ ముఖ్యంగా రాప్తాడు నియోజకవర్గంలోని కురుబలకు గొర్రెలు, మేకల యూనిట్లు, రుణాలు ఎక్కువగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## కురుబలకు ఇది గొప్ప పండుగ

**- కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు**

కనకదాసు రాష్ట్రస్థాయి జయంతోత్సవాలు కురుబలకు ఇది గొప్ప పండుగ. జిల్లాలో కురుబలు చాలామంది ఉన్నారు. వారికి చాలా సమస్యలు ఉన్నాయి. ఉమ్మడి అనంత జిల్లాకు అవసరమైన నిధులను తీసుకురావాలని ఎంపీలను కోరారు. వచ్చే సంవత్సరం నిర్వహించే కనకదాస జయంతికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఆహ్వానిసాం. కల్యాణదుర్గం పట్టణంలో కనకదాసు విగ్రహ ఏర్పాటు చేస్తాం. కురుబలకు అన్నివిధాలా తాము సహకరిస్తాం.

## భక్త కనకదాసు జయంత్యుత్సవాలు హర్షణీయం

**- జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్**

కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ శ్రీ భక్త కనకదాస రాష్ట్రస్థాయి జయంతోత్సవాలను అనంతపురం జిల్లాలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు ధన్యవాదాలు తెలిపారు. బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ సెక్రటరీ పోలా భాస్కర్, ఐఏఎస్, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ సంచాలకులు, మేనేజింగ్ డైరెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ కనకదాస రాష్ట్రస్థాయి జయంతోత్సవాల ను ఘనంగా నిర్వహించడం పట్ల చాలా సంతోషంగా



ఉందన్నారు. విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

అనంతరం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కలెక్టర్‌కు శాలువా కప్పి మెమోంటో అందజేసి మంత్రి సన్మానించారు. సీపీఐ నాయకులు జగదీష్, జిల్లా కురుబ కుల సంఘాల నాయకులు తిప్పటి ఈశ్వరయ్య, తగరకుంట కృష్ణమూర్తి, ఆంజనేయులు, అవుల కృష్ణయ్య, గంగులకుంట రమణ, సీనయ్య, విరల గౌడ్, బాలాజీ, మల్లికార్జున, సోమశేఖర్ తదితరులను శాలువా కప్పి సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డీడీ ఖుష్బూ కొఠారి, ఆర్డీవో కేశవ నాయుడు, డీటీడబ్ల్యూవో రామాంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, తహసీల్దార్ హరికుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, కురుబ, వెనుకబడిన తరగతుల సహకార సంఘాల నాయకులు, ఆయా శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

**- హిందూపురం ఎంపీ బి.కె.పార్థసారథి**

ఎన్నికలకు ముందు భక్త కనకదాసు జయంతిని అధికారికంగా నిర్వహించాలని చంద్రబాబుని అడిగితే ఆనాడు హామీ ఇచ్చారు. ఆ హామీని నెరవేరుస్తూ ఈరోజు అధికారికంగా కనకదాసు జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు. 15-20 సంవత్స రాల నుంచి కురుబ కులస్తులు ఆర్థికంగా, రాజకీయంగా ముందుకు ఎదుగుతు న్నారు. వారికి చదువు, సంస్కారం, పాలనలో



భాగస్వామ్యం ఉంది. కర్ణాటకలో పుట్టిన భక్త కనకదాసు కురుబ కులానికి వన్నెతెచ్చిన వ్యక్తి. ఆయ నను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళుతున్నాం. కురుబలు అందరితో సమానంగా ఎదగాలంటే బాగా చదువుకుని ఆర్థికంగా ఎదిగి రాజకీయాల్లోకి రావాలి. ఇతర కులస్తులను గౌరవించాలి. అందరం సమానంగా ఎదిగి హక్కుల కోసం పోరాడుతూ కురుబల అభివృద్ధికి ఐకమత్యంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఎన్నికల హామీలన్నీ తమ ప్రభుత్వం నెరవేరుస్తుంది. ఉమ్మడి జిల్లాకు కేంద్రం నుంచి ఎంపీ నిధులు తీసుకు వస్తాం.. కురుబ కళ్యాణ మండపాల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు.

పుణ్యభూమి నా దేశం నమో నమామి

## సంపాదకీయం

# నమో వేంకటేశ

తిరుమల గిరులపై కొడిగడుతున్న సనాతన ధర్మం దీపం కొండెక్కకుండా -రెండు చేతులూ అడ్డుపెట్టే కర్తవ్య నిర్వహణకు ఉపక్రమించింది కూటమి ప్రభుత్వం. తిరుమల అన్నమయ్య భవనం సాక్షిగా టీటీడీ ధర్మకర్తల మండలి తీసుకున్న నిర్ణయాలు -వెంకన్న సన్నిధిలో మళ్లీ ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తుందన్న విశ్వాసం కలిగించేవే. కలియుగ వైకుంఠమైన తిరుమల శ్రీవారి ఆలయం కోట్లాది హిందువులకు అతిపెద్ద పుణ్యక్షేత్రం. ఆ దివ్యక్షేత్రం ఏపీలో ఉండటం నిజానికి రాష్ట్రం చేసుకున్న అదృష్టం. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ముందూ.. ఉమ్మడి రాష్ట్రంలోనూ.. విభజిత రాష్ట్రంగా అవతరించిన సందర్భంలో.. ఇలా -ఏపీని పాలించిన ప్రభుత్వాలు, పార్టీలూ.. ఏడుకొండలవాడి పవిత్రతను కాపాడటంలో, భక్తుల మనోభావాల పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యం చూపిన దాఖలా లేదు. అంతటి పవిత్రత కలిగిన తిరుమల శ్రీవారి సన్నిధిన -గత వైసీపీ ప్రభుత్వంలో జరిగినన్ని అపచారాలూ ముందెన్నడూ చోటు చేసుకోలేదనడానికి కలియుగ దైవమే ప్రత్యక్ష సాక్షి. 'గోవింద' నామస్మరణతో మైమర్చిపోయే అశేష భక్తజనం.. కొండపై అకృత్యాలను కళ్లారా చూసి 'గోవింద గోవింద' అంటూ తల్లడిల్లిన ఉదంతాలు లెక్కలేనన్ని! వెంకన్న సన్నిధిని పరమ పవిత్రంగా పరిరక్షించాల్సిన పాలక మండలే -కాసులకు కక్కుర్తిపడి.. తితిదే నిబంధనలకు తూట్లు పొడిచి.. కల్తీ ప్రసాదాలను సైతం స్వామికి నైవేద్యం పెట్టిన పాపపంకిల ఘట్టాలకు తెరలేపిన ఉదంతం వెంకన్న భక్తులను కలచివేసింది. భక్తుల మనోభావాలు, ఆచారాలకు పాలకమండలే భిన్నంగా వ్యవహరించిన తీరు -శ్రీవారి కోట్లాది భక్తులు విన్నబోయేలా చేసింది. తిరుమల దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడూ అత్యంత నియమనిష్టలతో, శ్రద్ధాసక్తులతో స్వామివారిని దర్శించుకోవాలని చెప్పాల్సిన పాలక మండలి సభ్యులు, ప్రభుత్వ బాధ్యులే -స్వామి దర్శన టికెట్లను అంగడి సరుకు చేశారు. స్వామి సేవలను -బహిరంగ విపణిలో పెట్టి కాసులు ఏరుకున్నారు. భక్తులు అత్యంత పవిత్రంగా భావించే క్షేత్ర పవిత్రతను పూర్తిగా మంటగలిపారనడంలో ఏమాత్రం సంకోచం అక్కర్లేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగిన దుష్టాంతాలను ఇంతకుమించి ప్రస్తావించుకున్నా -మహా పాపానికి ఒడిగట్టడమే అవుతుంది!!

దేవదేవుడికి -వైసీపీ చేసిన అపచారాల పాపఫలమే సార్వత్రిక ఎన్నికలలో మహాఓటమి అన్నది భక్తుల విశ్వాసం. కలికాలపు పెడధోరణులను సంహరించి తన భక్తులను ఎలా కటాక్షించాలో స్వామికి తెలీంది కాదు. తిరుమల దివ్యక్షేత్రానికి పూర్వ వైభవం తెచ్చేందుకే.. ఆ దేవదేవుడు తనను గెలిపించాడని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యానం ఇక్కడ ప్రస్తావనార్హం. పెదాలమీద నుంచి కాదు, ముఖ్యమంత్రి మాటలు మనసులోంచి వచ్చాయని చెప్పడానికి -తిరుమల ప్రతిష్ఠను కాపాడేందుకు కూటమి సర్కారు తీసుకుంటున్న చర్యలు నిలువుటద్దమే! ఎన్డీయే సర్కారు గద్దెనెక్కిన మరుక్షణం నుంచే తిరుమల గిరులపై కొట్టొచ్చిన మార్పులే కనిపిస్తున్నాయి. ప్రసాదం పవిత్రత పూర్తిగా అంతరించిపోయిందని మొన్నటి వరకూ ఏ భక్తులు ఆందోళన చెందారో.. ఇప్పుడు అదే భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు కొండమీద పరిశుభ్రత తాండవిస్తోంది. అధికారుల ఆలోచన, ప్రవర్తనా విధానంలో మార్పు చోటుచేసుకుంది. భక్తులకు అందుతున్న సేవలపట్ల గోవిందుడే సంతృప్తి వ్యక్తం చేస్తున్నాడన్న భావన కనిపిస్తోంది. ఇప్పుడు తిరుమల పేరు తలిస్తే.. ఏడుకొండలవాడి వైభవం, ఆధ్యాత్మికత మాత్రమే గుండెలనిండా చోటు చేసుకుంటోంది. ఇదీ భక్తుల మాట!

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సతీసమేతంగా శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు -వెంకన్న సన్నిధిలో భక్తులకు ఇచ్చిన హామీలను ఇక్కడ గుర్తు చేసుకోవాలి. 'ప్రసాదాల నాణ్యతలో రాజీపడం. ముడిసరకుల సేకరణలో జాగ్రత్తలూ తీసుకుంటాం. శ్రీవారి లడ్డూ ప్రసాదానికి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపుంది. అది స్వామి మహిమ. లడ్డూ ప్రసాదం, అన్నప్రసాదం నాణ్యత పెరిగిందని భక్తులు చెబుతున్నారు. ఇది ఎల్లప్పుడూ, పూర్తిగా కొనసాగుతుంది. తిరుమల ప్రతిష్ఠను కాపాడేందుకు శాయశక్తులా కృషి చేయడమే కాదు, పూర్వ వైభవాన్ని తీసుకొస్తా'!

ఇప్పుడు -టీటీడీ ధర్మకర్తల మండలి తీసుకున్న ముఖ్య నిర్ణయాలు.. ఆనాడు ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టేవిగానే ఉన్నాయి. అపవిత్రమైన తిరుమల గిరులను ప్రక్షాళన చేస్తానన్న సీఎం చంద్రబాబు -ఆ ప్రయత్నంలో కృతకృత్యులవుతారనడానికి తితిదే తాజా నిర్ణయాలు నిదర్శనం. 'ఏఐ సాంకేతికత సాయంతో రెండు మూడు గంటల్లోనే భక్తులకు దర్శనమయ్యేలా నిపుణుల కమిటీతో అధ్యయనం చేయిస్తామన్న ఒక్క నిర్ణయం చాలు -దేవదేవుడి భక్తులపట్ల తితిదే చూపనున్న ఆదరణను అర్థం చేసుకోవడానికి. 'ఓం నమో వేంకటేశా' అని గుండెలనిండా భక్తిపారవశ్యంతో స్మరించుకునే రోజులు భక్తులకు ప్రాప్తించనున్నాయన్న మాట. వెంకటన్న భక్తులకు ఇది పండుగలాంటి మాటే!!

## మాటకు మాట



**ఏపీలో తప్పు చేయనివారిపై తప్పుడు కేసులు పెడుతున్నారు: మాజీ మంత్రి రోజా**



కామన్‌మేన్: జగనాసురుడి పాలనా కాలం నుంచి ఇంకా బయటపడినట్టు లేదు. ఇన్నాళ్లకు.. తప్పుడుగాళ్లపై కరెక్ట్ కేసులు పెడుతుంటే.. పూర్ వైసీపీకి రివర్స్‌లో కనిపిస్తున్నట్టుంది.

**రోజా: ఏపీని హిట్లర్, గడాఫీ కలిసి పాలిస్తున్నట్లుంది?**

కామన్‌మేన్: అందుకా.. అసెంబ్లీకి రావడానికి వణుకుతున్నాడు జగనాసురుడు.

**రోజా: చంద్రబాబు, పవన్ పాలనలో అదృశ్యమైన మహిళల ఆచూకీ కోసం కూటమి ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంది?**

కామన్‌మేన్: ఇక్కడ ఓడిపోగానే పక్క రాష్ట్రానికి పరారైన తమరా.. నీతీ నిజాయితీల్ని నిలదీసేది? అవకాశవాద రాజకీయవాదులు అడగాల్సిన ప్రశ్నేనా ఇది!

**రోజా: వైఎస్సార్సీపీ హయాంలో వేల సంఖ్యలో మహిళలు, యువకులు మిస్సయ్యారని అబద్ధపు ప్రచారం చేశారు. అసెంబ్లీ సాక్షిగా అసలు నిజాలు బయటికొచ్చాయి.**

కామన్‌మేన్: ఏంటి? మీవాళ్లు అసెంబ్లీకి రాకుండానే!

# పిశాచుల పీచమణచాలి!

**చిన్న పిల్లలూ, మహిళలన్న విచక్షణ లేకుండా బండబూతులు తిట్టడం, ఫొటోలను మార్ఫింగ్ చేసి వికృతానందం పొందడమా ప్రజాస్వామ్యమంటే? జగనన్న సైన్యమంటూ సైకోల మూకంతా ప్రత్యర్థుల వ్యక్తిత్వాలపై విషం చిమ్మినప్పుడు జగన్‌రెడ్డి నోరెందుకు పెగల్లేదు? కన్నతల్లిని, తోబుట్టువునే అవమానించినపుడే నోరు పెగల్చని జగన్‌రెడ్డి... విష సర్పాల కోరలు పీకడానికి కూటమి ప్రభుత్వం సిద్ధపడితే గగ్గోలు పెట్టడం.. జగన్ నికృష్ట రాజకీయానికి నిలువుటద్దం కాకపోదు!**

జగన్ జమానాలో విద్వేష విషాన్ని విరజిమ్మిన సైబర్ ఉగ్రవాదులను ఏరివేయాల్సిందే. గత ఐదేళ్లుగా జరిగిన, జరుగుతున్న సోషల్ మీడియా అకృత్యాలపై దర్యాప్తు జరిపి బాధ్యులను బోనెక్కించాల్సిందే. సోషల్ మీడియాలో బూతుల వరద పారిస్తోన్న వైసీపీ పిశాచుల పీచమణచాల్సిందే. నైతిక విలువలను, ప్రజాస్వామ్య సూత్రాలను పాతరేసి విద్వేషపూరిత విష పోస్టులతో విషంచిమ్మిన వైసీపీ సైబర్ ఉగ్రవాదులందరినీ నిర్దాక్షిణ్యంగా కటకటాల్లోకి నెట్టాలి. వాళ్లను వెనకుండి నడిపిస్తున్న కుట్రదారులనూ, వ్యవస్థీకృత సైబర్ నేరాలను ప్రోత్సహిస్తున్న పెద్దలను చట్టంముందు నిలబెట్టాల్సిందే. యావత్ ప్రజానీకం కోరుకుంటున్నదిదే!

వైసీపీ అభయారణ్య క్రూరమృగాలను పట్టి బోనులో పెట్టకపోతే మనం నిర్మించుకున్న ప్రజాస్వామ్యానికి అర్థముండదు. వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులు వాడుతున్న అసభ్యకర వికృత భాషకి సభ్యసమాజం సిగ్గుతో తలదించుకొంటుంది. ప్రతిపక్షనేత చంద్రబాబు, లోకేష్‌పై, ఇంట్లో మహిళలపై, మీడియా అధిపతులపై అసభ్య పదజాలంతో, రాయడానికి వీలులేని భాషతో దూషణలకు దిగడం నీచ నికృష్ట రాజకీయాలకు నిదర్శనం. ప్రజల కోసం సర్వం త్యాగంచేసిన మహామహులకు జన్మనిచ్చిన తెలుగు గడ్డపై ఇటువంటి అల్పులు ఉండటం విషాదకరం. వైసీపీ సోషల్ మీడియా సభ్యత, సంస్కారాలకు తిలోదకాలిచ్చి జుగుప్సే ఆదర్శంగా నిలుస్తోంది. దుర్గంధభూయిష్టమైన భాష ఇంటాబయట అందరికీ రోత పుట్టిస్తుంది. అశ్లీల అసభ్య భాషతో రాష్ట్ర భవిష్యత్‌నే భ్రష్టుపట్టిస్తున్నారు. వివేకంలేని వ్యాఖ్యలు, కక్షపూరిత విధానాలతో, పచ్చిబూతులతో ఏపీ పరువును గంగపాలు చేస్తున్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛ ద్వారా మంచిని చేరవేయడానికి సోషల్ మీడియా అద్భుత వేదిక. కానీ జగన్ ముఠా దానిని బూతులకు వేదికగా మార్చారు. జగన్‌రెడ్డి కేవలం బూతులు తిట్టడానికే ప్రత్యేక విభాగాలు ఏర్పాటుచేసి 'పేటియం బ్యాచ్‌లను' పోషించడానికి ప్రజాధనాన్ని ధారపోశారు.

**-నీరుకొండ ప్రసాద్**

రాజకీయ ప్రత్యర్థులుగా చంద్రబాబు, లోకేష్‌లపై ఫేక్ న్యూస్‌లు, ఫేక్ విశ్లేషణలతో విషం చిమ్మడమే ప్రధాన అజెండాగా కొన్ని యూట్యూబ్ ఛానెల్స్ వైసీపీ ఒప్పందాలు చేసుకొన్నదన్న విషయం జగద్విదితం. సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ ఏది నిజమో? ఏది అబద్ధమో? తెలుసు కోలేనంతగా దిక్కుమాలిన ఫేక్ వీడియోలు రూపొందించి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నది వైసీపీ సోషల్ మీడియా. మంచిని సమాజానికి చేరవేయాల్సిన సోషల్ మీడియా స్వార్థ ప్రయోజనాల కొరకు చెడును సమాజానికి చేరవేస్తోంది. ప్రపంచంలో ఎలాంటి ఆవిష్కరణలు జరిగినా అవి ఇప్పటి వరకూ మానవజీవితం సౌకర్యవంతం కావడానికి ఉపయోగపడ్డాయి. ఎలక్ట్రానిక్, ఎలక్ట్రిక్ పరికరాలు జనబాహుళ్యానికి అందుబాటులోకి వచ్చి, జన జీవన విధానంలో ఒక భాగమై, పని విధానంలో అనేక మార్పులకు చోటిచ్చాయి. సాంకేతిక పరిజ్ఞానం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఏ సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచాన్ని మన కళ్ళెదుట నిలబెట్టిందో, అదే సాంకేతిక పరిజ్ఞానం దుర్మార్గుల చేతిలోపడి మానవ సంబంధాలు, విలువలను విధ్వంసం చేస్తోంది. ప్రజాహితం లేకుండా దుర్బుద్ధితో మీడియాను ఏర్పాటు చేసుకొని అబద్ధాలు చెప్పడం, అభాండాలు వేయడం, బురదచల్లడం, అరాచకపు వితండ వాదనలు, వికృత ధోరణితో విశ్లేషణలు చెయ్యడం, నందిని పందిని చేస్తూ వికృత వీడియోలతో విషం చిమ్ముతున్నారు. ఈ ధోరణి అరికట్టక పోతే ప్రజాస్వామ్య వ్యవస్థకే పెనుముప్పు. సోషల్ మీడియా దారుణాలను నియంత్రించడానికి, దుర్వినియోగానికి పాల్పడుతున్న వాళ్లను శిక్షించడానికి ప్రెస్ కౌన్సిల్‌కి ఎటువంటి అధికారాలు లేకపోవడంతో.. పైశాచిక దురాగతాలు పెచ్చుమీరుతున్నాయి. నేడు భావ ప్రకటనా స్వేచ్ఛ స్వార్థ శక్తుల చేతిలో ప్రమాదకర ఆయుధంగా మారింది. విలువల విధ్వంసానికి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం బీజం వేస్తుంది.

**అభిప్రాయ వ్యక్తీకరణ, ప్రభుత్వాలపై సద్విమర్శ ప్రజాస్వామ్య మౌలిక లక్షణాలే. అట్లాగే భావప్రకటనా స్వేచ్ఛ అనేది ప్రజలు తమ ఆశలూ ఆశయాలను నెరవేర్చుకోవడానికి దోహదపడాలి. కానీ అవకాశాన్ని జగన్ వందిమాగధులు దుర్వినియోగం చేయడంతో సుమోటోగా కేసులు పెట్టాలని సర్వోన్నత న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. సోషల్ మీడియాలో బూతుల వరద పారిస్తోన్న వైసీపీ సైబర్ ఉగ్రవాదులపై కూటమి ప్రభుత్వం కేసులు పెట్టడంపై.. ఆ పార్టీ అధినేత జగన్‌రెడ్డి 'ఇదేం అన్యాయం. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తారా?' అంటూ వీరావేశం ప్రదర్శిస్తున్నారు. సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు పెట్టడమేమిటి? అంటూ ఆక్రోశిస్తున్నారు.**

కూటమి నేతలపై కాలకూట విషం చిమ్మడం, కుటుంబ సభ్యులను హేయమైన భాషతో హేళన చేయడం వైసీపీ పేటీయం బ్యాచ్‌కి పరిపాటిగా మారింది. విష ప్రచారం కొరకే విష నాగులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకుంది వైసీపీ. దీని కోసం బెంగళూరు, హైదరాబాద్, విదేశాలలోనూ ఫేక్ పోస్టుల పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని మార్ఫింగులతో పోస్టులు రూపొందించి వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్‌కు చేర్చడం.. అక్కడినుంచి రాష్ట్రంలోని వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్లు, కో కన్వీనర్లకు.. అక్కడినుంచి అసెంబ్లీ నియోజకవర్గాల కన్వీనర్లు, కో కన్వీనర్లకు చేరుస్తారు. తర్వాత మండలస్థాయికి, గ్రామ, వార్డుస్థాయుల్లో ఏర్పాటు చేసుకున్న వాట్సాప్ గ్రూప్‌లు, ట్విట్టర్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్టులు చేస్తున్నారు. ఈవిధంగా కొన్ని గంటల్లోనే లక్షలమందికి పోస్టులు పంపిస్తున్నారు. ఆ పోస్టులపై వైసీపీ ఉన్మాదులు మరింత నీచమైన కామెంట్లు పెడుతున్నారు. పచ్చి బూతులు, నీచ నికృష్టమైన భాషతో వాటిని జిల్లా కేంద్రానికి, రాష్ట్రస్థాయి సోషల్ మీడియా విభాగానికి పంపుతున్నారు.

భిన్నాభిప్రాయాలను వ్యక్తం చెయ్యడం, ప్రభుత్వాలను విమర్శించడం ప్రజాస్వామ్య మౌలిక లక్షణాలు. అట్లాగే భావప్రకటనా స్వేచ్ఛ అనేది ప్రజలు తమ ఆశలూ ఆశయాలను నెరవేర్చుకోవడానికి దోహదపడుతుంది. కానీ తమ ఆలోచనలను, అభిప్రాయాలను నిర్భయంగా వెల్లడించేందుకు ఉన్న హక్కును జగన్ వందిమాగధులు ఇష్టారీతిన దుర్వినియోగం చేయడంతో ద్వేషపూరిత విషంచిమ్మే వారిపై సుమోటోగా కేసులు పెట్టాలని పోలీసులను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. విద్వేష నేరాల కట్టడిలో అలక్ష్యం వహిస్తే కోర్టు ధిక్కరణగా పరిగణిస్తామని కూడా హెచ్చరించింది. సోషల్ మీడియాలో బూతుల వరద పారిస్తోన్న వైసీపీ సైబర్ ఉగ్రవాదులపై కూటమి ప్రభుత్వం కేసులు పెట్టడంపై ఆ పార్టీ అధినేత జగన్‌రెడ్డి ఇదేం అన్యాయం, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తారా? అంటూ వీరావేశం ప్రదర్శిస్తున్నారు. సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు పెట్టడమేమిటి? అంటూ ఆక్రోశిస్తున్నారు. నిజంగా సోషల్ మీడియా యాక్టివిస్టులంటే ప్రజలకు మంచిచేసే అంశాల మీద ఉద్యమించే వారు. ప్రజల మేలుకోసం ఎంతటి కష్టాన్నైనా భరించేవారు. కానీ, జగన్ వెనకేసుకొస్తున్న వారు మాత్రం తనకు గిట్టని వారిపై విద్వేష విషాన్ని విరజిమ్మేవారు. కానీ వైసీపీకి వ్యతిరేకంగా మాట్లాడే వాళ్లందరిపై బూతులు మాట్లాడుతూ వ్యక్తిత్వ హననం చేయడమా భావప్రకటనా స్వేచ్ఛ అంటే? దీనికి జగన్‌రెడ్డి సమాధానం చెప్పాలి. చిన్న పిల్లలూ, మహిళలూ అన్న తేడా లేకుండా ఇంట్లో అందరినీ బండబూతులు తిట్టడం, వారి ఫొటోలను మార్ఫింగ్ చేసి వికృతానందం పొందడమా ప్రజాస్వామ్యమంటే? జగనన్న సైన్యమంటూ ఆయన నియమించిన సైకోలంతా కలిసి ప్రత్యర్థుల వ్యక్తిత్వాలపై విషం చిమ్మినప్పుడు జగన్‌రెడ్డి ఎందుకు నోరు తెరవలేదు? నీవు నియమించిన బూతుల పేటియం బ్యాచ్ కన్నతల్లిని, తోడబుట్టిన చెల్లిని సైతం దారుణంగా అవమానించడం ప్రజాస్వామ్యమా? నీవు నియమించిన నీచ ప్రబుద్ధులను పట్టుకుని బోనెక్కిస్తుంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తారా? అనడం, వారి తరఫున న్యాయపోరాటం చేస్తాననడమంటే అంతకంటే మహాపాపం, ప్రజాద్రోహం ఉంటుందా జగన్ రెడ్డి? సోషల్ మీడియాను రోత డ్రెయినేజీగా మార్చిన ఘనత జగన్‌రెడ్డికే దక్కుతుంది. జగన్ వందిమాగధులు నోరు తెరిస్తే.. ఆ కంపు ముందు డ్రైనేజీలు కూడా పోటీపడలేక పోతున్నాయి. అటువంటి పరిపాలన చేసిన జగన్ ఇప్పుడు అమాయకుడిగా గుండెలు బాదుకొంటూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తారా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రజాధనంతో పాములకు పాలుపోసి పెంచి పోషించిన జగన్‌రెడ్డి ఇప్పుడు కూటమి ప్రభుత్వం విష సర్పాల కోరలు పీకడానికి సిద్ధపడితే అధర్మం, అన్యాయమంటూ గగ్గోలు పెట్టడం సిగ్గుచేటు! ■

చైతన్యరథం

# శ్రీవారి భక్తులకు ఇక శీఘ్ర దర్శనం

- క్యూలైన్లలో వేచిఉండకుండా నిపుణుల కమిటీతో నివేదిక
- శారదా పీఠం లీజు రద్దు.. స్థలం వెనక్కుతీసుకోవాలని నిర్ణయం
- టూరిజం ద్వారా ఇచ్చే దర్శనం టికెట్ల కోటా పూర్తిగా రద్దు
- తిరుపతి తితిదే స్థలంలో ముంతాజ్ హెూటల్ అనుమతి రద్దు
- శ్రీవాణి ట్రస్ట్ పేరు రద్దు.. మెయిన్ ఆకౌంట్‌తో లావాదేవీలు
- అన్యమత ఉద్యోగులను ప్రభుత్వంలోకి తరలించేలా నివేదిక
- తిరుమల డంపింగ్ యార్డులో చెత్త మూడు నెలల్లో తొలగింపు
- శ్రీనివాస సేతు ఫ్లై ఓవర్ బ్రిడ్జికి గరుడ వారధిగా నామకరణం
- తిరుమలలో రాజకీయాలు మాట్లాడినా, ప్రచారం చేసినా చర్యలు
- ప్రైవేటు బ్యాంకుల్లో నగదును పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో డిపాజిట్
- నిత్యాన్నదానంలో నాణ్యత పెంచి మరో కూర వడ్డింపునకు ఆమోదం
- తిరుపతి స్థానికులకు ప్రతినెలా మొదటి మంగళవారం దర్శనం
- టీటీడీ ధర్మకర్తల మండలి తొలి సమావేశంలో కీలక నిర్ణయాలు



తిరుమల(చైతన్యరథం): టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్ బి.ఆర్.నాయుడు అధ్యక్షతన సోమవారం ఉదయం తిరుమల అన్నమయ్య భవనంలో తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. సమా వేశం ముగిసిన అనంతరం తీసుకున్న నిర్ణయాలను చైర్మన్ మీడియాకు వెల్లడించారు.

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ఉపయోగించి క్యూలైన్లలో భక్తులు ఎక్కువసేపు వేచి ఉండకుండా 2 లేదా 3 గంటల్లోనే దర్శనమయ్యేలా ఒక నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కమిటీ ఇచ్చే రిపోర్టు ఆధారంగా భక్తులకు త్వరితగతిన దర్శన భాగ్యం కల్పించనున్నారు.
- టీటీడీలో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులను బయటకు పంపేందుకు ఎటు వంటి చర్యలు తీసుకోవాలనే విషయమై ప్రభుత్వానికి నివేదిక అందించనుంది.
- తిరుమల డంపింగ్ యార్డులోని చెత్తను మూడు లేదా నాలుగు నెలల్లో తొలగించేందుకు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.
- తిరుపతి శ్రీనివాస సేతుకు గరుడ వారధిగా నామకరణం చేస్తూ నిర్ణయం తీసుకుంది.
- అలిపిరిలో టూరిజం కార్పొరేషన్ ద్వారా దేవలోక్‌కు కేటాయించిన 20 ఎకరా ల భూమిని వెనక్కితీసుకుని టీటీడీకి అప్పగించే విధంగా ప్రభుత్వాన్ని కోరనుంది.
- తిరుమలలో రాజకీయాలు మాట్లాడే వారిని, ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.
- తిరుపతి స్థానికులకు ప్రతినెలా మొదటి మంగళవారం శ్రీవారి దర్శనం కల్పించనుంది.
- శ్రీవాణి ట్రస్టు పేరును మార్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి వచ్చే సమావేశంలో ఒక రిపోర్టు ఇవ్వాలని ఆదేశించింది.
- ప్రైవేటు బ్యాంకుల్లో డిపాజిట్లను వెనక్కు తీసుకుని పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో డిపాజిట్ చేసేందుకు నిర్ణయం. ఈ అంశంపై వచ్చే సమావేశంలో చర్చించేలా నిర్ణయం తీసుకున్నారు.
- నిత్యాన్నదాన మెనూలో నాణ్యతను పెంచి అదనంగా మరో పదార్థాన్ని చేర్చేందుకు నిర్ణయం తీసుకున్నారు.
- వివిధ రాష్ట్రాలకు చెందిన టూరిజం కార్పొరేషన్లు, ఏపీఎస్ ఆర్టీసీ, టీఎస్ ఆర్టీసీలకు టీటీడీ కేటాయించిన శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300) టికెట్లకు సంబంధించి అవకతవకలు జరిగాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో వాటిని పూర్తిగా పరిశీలించిన అనంతరం సదరు సంస్థలకు కోటాను పూర్తిగా రద్దు చేయాలని నిర్ణయం తీసుకుంది.
- తిరుమలలో గో గర్భం డ్యామ్ వద్ద విశాఖ శారద పీఠానికి చెందిన మఠం నిర్మాణంలో అవకతవకలు, అక్రమణలు జరిగినట్లు టీటీడీ అధికారుల కమిటీ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో భవనం లీజును రద్దు చేయాలని నిర్ణయం తీసుకుంది.
- బ్రహ్మోత్సవాలలో విశేష సేవలు అందించిన ఉద్యోగులకు గత సంవత్సరం ఇచ్చిన బ్రహ్మోత్సవ ప్రోత్సాహకాన్ని 10 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. తద్వారా రెగ్యులర్ ఉద్యోగులకు రూ.15,400, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగు లకు రూ. 7,535 బ్రహ్మోత్సవ బహుమానం దక్కనుంది.
- శ్రీవారి ఆలయంలో లీకేజీల నివారణకు, అన్నప్రసాద కేంద్రం ఆధునికీకరణ కు టీవీఎస్ సంస్థతో ఎంఓయూ. ఈ పనులను ఆ సంస్థ ఉచితంగా చేయనుంది.

## మత్స్యకార ప్రాంతాల్లోనూ శ్రీవారి ఆలయాలు

- రాష్ట్రంలో ప్రతి నియోజవర్గంలో గో సంరక్షణ కేంద్రాలు
- విశాఖ, భీమిలి బీచ్‌ల రహదారుల్లో శ్రీవారి కీర్తనలకు స్పీకర్లు
- టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడుకు ఎంపీ కలిశెట్టి వినతిపత్రం



తిరుపతి(చైతన్యరథం): టీటీడీ ధర్మకర్తల సభ్యుల సమావేశంలో పాల్గొన్న చైర్మన్ బి.ఆర్.నాయుడును సోమవారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కలిశారు. టీటీడీకి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలపై వినతిపత్రం అం దజే శారు. అందులో ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ మత్స్యకార ప్రాంతాల్లో వేంకటేశ్వరస్వామి ఆలయాలు, ఫంక్షన్ హాళ్లు నిర్మించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో గోవు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేంద్రాలు గోవు సంరక్షణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో ముఖ్యంగా అండమాన్ నికోబార్, కొండమల్లాం (ఎచ్చెర్ల నియోజకవర్గం), ముంబాయి, భువ నేశ్వర్ వంటి చోట్ల వేంకటేశ్వరస్వామి ఆలయాల నిర్మాణాల ఆవశ్యకతను వివరించా రు. తిరుమల తిరుపతి దేవస్థానంలో జరుగుతున్న అన్నదాన సేవలను దేశంలోని ఇతర ప్రధాన నగరాలలోనూ అందించాలని సూచించారు. విశాఖపట్నం, ఢిల్లీ, హైదరాబాద్ వంటి నగరాల్లో ఈ సేవలు ప్రారంభించటం ద్వారా భక్తులకు ఆధ్యాత్మిక అనుభవం కలగాలని కోరారు. 2019 తర్వాత టీటీడీ నిర్మించిన కొత్త ఫంక్షన్ హాళ్లలో ధార్మిక ఉత్సవాలు, పండుగలు, భక్తి సమ్మేళనాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవా లని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా స్థానిక భక్తులు పాల్గొనే అవకాశం ఉంటుందని చెప్పారు. విశాఖపట్నం జిల్లా రుషికొండ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ఆర్కే బీచ్ వైపు, అలాగే మరోవైపు భీమిలి వరకు రహదారి వెంట ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వేంకటేశ్వర నామాలు ప్రసారం చేయడం కోసం స్పీకర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తిచేశారు. ప్రతి ఉదయం, సాయంత్రం వేళలో నామస్మరణ పఠనాలు వినిపించడం వల్ల ఆధ్యాత్మిక ప్రేరణ కలుగుతుందని తెలిపారు. శ్రీ వెంకటేశ్వర భక్తి చానల్‌లో ప్రసారమయ్యే కార్యక్రమాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యక్ష ప్రసారం చేయాలని కోరారు. ఇది పర్యాటకులను ఆకర్షించడంతో పాటు భక్తుల్లో భక్తి భావం పెంపొందించేలా చేస్తుందన్నారు. స్పందించిన టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు సూచ నలను స్వీకరించి వాటి అమలుకు చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## 26న గుంటూరులో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

### మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక



విజయవాడ(చైతన్యరథం): గుంటూరులో ఈ నెల 26న జరిగే రాష్ట్రస్థాయి రాజ్యాంగ దినోత్సవం వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొనాలని కోరుతూ సోమవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఎస్‌వైకేఎస్ స్టేట్ డైరెక్టర్ అన్నుమాన్ ప్రసాద్ దాసు ఆహ్వాన పత్రికను అందజేశారు. గుంటూరు లాడ్జ్ సెంటర్ నుంచి అంబేద్కర్ విగ్రహం, బృందావన్ గార్డెన్ వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గుంటూరు జిల్లా యువజన అధికారి కిరణ్మయిదేవిరెడ్డి తెలిపారు.

## నారా రోహిత్‌కు ఎంపీ కలిశెట్టి పరామర్శ



నారావారిపల్లె(చైతన్యరథం): నారావారిపల్లెలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌ను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కలిశారు. అనంతరం నారా రోహిత్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట జిల్లాకు చెందిన ముఖ్యనాయకులు ఉన్నారు.

చైతన్యరథం

## దిశ యాప్, చట్టం పనిచేస్తే..

# మహిళలపై అఘాయిత్యాలు ఎందుకు పెరిగాయ్?

### - మండలిలో వైసీపీ సభ్యులకు హోం మంత్రి అనిత కౌంటర్

అమరావతి (చైతన్యరథం): గత ఐదేళ్లలో మహిళలపై అత్యాచారాలు, దాడులు జరిగినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని హోం మంత్రి అనిత విమర్శించారు. శాసనమండలిలో సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. ఏపీలో జగన్ ప్రభుత్వం కంటే ఈ ఐదు నెలల కూటమి ప్రభుత్వంలో నేరాల రేటు చాలా తగ్గిందని మంత్రి అనిత స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో అత్యాచారానికి గురైన బాధితుల పరామర్శకు వెళ్లిన తమ పైనే కేసులు పెట్టారన్నారు. దిశ చట్టం గురించి వైసీపీ సభ్యులు గొప్పగా చెబుతున్నారు.. అసలు ఆ చట్టం ఉందా? దిశ యాప్, చట్టం పనిచేస్తే మహిళలపై అఘాయిత్యాలు ఎందుకు పెరిగాయి. ఉన్న నిర్భయ చట్టాన్ని వదిలేసి.. లేని దిశ చట్టాన్ని తీసుకొచ్చారు. కూటమి ప్రభుత్వ హయాంలో మహిళలపై అసభ్యంగా ప్రవర్తించిన వారిని అరెస్టు చేస్తున్నాం. ముచ్చుమర్రి ఘటనలో బాలికను గుర్తించడానికి సమయం పట్టింది. పోలీసుల వైఫల్యం ఇప్పటిది కాదు.. వైసీపీ హయాం నాటిది. కూటమి ప్రభుత్వంలో పోలీసులు 24 నుంచి 48 గంటల్లో నేరస్థుల్ని పట్టుకుంటున్నారు. గత ఐదేళ్లలో పోలీసులు పరదాలు కట్టడానికి, చెట్లు నరకడానికి, రోడ్ల మీద కాపలా కాయడానికి పని చేశారు. ఒక్క మహిళనైనా వారు రక్షించారా? దిశ చట్టానికి చట్టబద్ధత లేకుండా దిశ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరంలో దిశ పోలీసు స్టేషన్ ప్రారంభించారు. అదే రోజు దళిత మహిళపై సామూహిక అత్యాచారం చేసిన దుండగులు.. ఆ మహిళను అపస్మారక స్థితిలో దిశ పోలీసు స్టేషన్ ముందు వదిలేసి వెళ్లారు. ఇది అప్పటి ప్రభుత్వ వైఫల్యం కాదా. దిశ యాప్‌తో నేరాలు తగ్గింది నిజమైతే.. గత ఐదేళ్లలో నేరాలు ఎందుకు పెరిగాయి. అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబ్ నిర్మాణానికి వైసీపీ హయాంలో కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. అది పూర్తయి ఉంటే నేరాలు జరిగిన వెంటనే శిక్షలు పడేందుకు అవకాశం ఉండేదని హోం మంత్రి అనిత అన్నారు.



మహిళల భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట

2014-19 మధ్య ఏపీలో మహిళలపై అఘాయిత్యాలు, దాడులకు సంబంధించి 83,202 కేసులు నమోదయ్యాయి. 2019-24 మధ్య 1,00,508 కేసులు నమోదయ్యాయి. గత ఐదేళ్లలో మహిళలపై అఘాయిత్యాలు 20.8 శాతం పెరిగాయి. జగన్ పాలనలో అనేక అఘాయిత్యాలు జరిగినా కనీస చర్యల్లేవు. మహిళా పోలీసు స్టేషన్ల బోర్డులను దిశ పీఎస్ లుగా మార్చి చేతులు దులుపుకున్నారు. అన్ని నేరాలకు మూల కారణమైన గంజాయి నియంత్రణపై జగన్ ఒక్కసారి కూడా సమీక్షించలేదు. మహిళల భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రత్యేక కోర్టులతో నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చేస్తున్నాం. జగన్ తల్లి, చెల్లికి అన్యాయం జరిగినా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. మహిళల జోలికొచ్చినా, సోషల్ మీడియాలో అసభ్యకరంగా మాట్లాడినా కఠిన చర్యలు తీసుకుంటాం. మహిళా పీఎస్‌లు, హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేసి నివారణ చర్యలు తీసుకుంటున్నాం. 5 నెలల కాలంలో జరిగిన నేరాలపై 24 గంటల్లోనే నిందితులను పట్టుకుని రిమాండ్‌కు పంపించాం. మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా కఠిన చట్టాలు, ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తామని అనిత వెల్లడించారు.

# వైసీపీ నేతల భూకబ్జాలకు అధికారుల వత్తాసు

- న్యాయం చేయాలంటూ టీడీపీ నేతలకు బాధితుడి వినతి
- పలు సమస్యలపై టీడీపీ కేంద్ర కార్యాలయానికి పోటెత్తిన అర్జీదారులు
- అర్జీలు స్వీకరించిన నేతలు వర్ల రామయ్య, నీలాయపాలెం విజయ్ కుమార్
- సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు









అమరావతి (చైతన్యరథం): తన భూమిని వైసీపీ నేతలు కబ్జా చేస్తే, అధికారులు కూడా వారితో కుమ్మక్కై తనకు అన్యాయం చేస్తున్నారని అన్నమయ్య జిల్లా రామాపురం మండలం కొండపల్లి గ్రామానికి చెందిన మస్తాన్‌రెడ్డి..టీడీపీ నేతలకు ఫిర్యాదు చేశాడు. కబ్జా చేసిన వ్యక్తులపై అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని తెలిపాడు. తన భూమిని కబ్జా దారుల నుండి విడిపించి న్యాయం చేయాలని టీడీపీ నేతలకు అర్జీ ఇచ్చి వేడుకున్నాడు.

వివిధ సమస్యలపై టీడీపీ కేంద్ర కార్యాలయానికి సోమవారం అర్జీదారులు పోటెత్తారు. ప్రజా వినతులు స్వీకరణ కార్యక్రమంలో అర్జీదారులనుండి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఏపీ స్టేట్ బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్ లు అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలు విని, పరిష్కారానికి వెంటనే అధికారులకు ఫోన్లు చేసి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం దేవరంపాడు దళితవాడకు చెందిన పలువురు బాధితులు విజ్ఞప్తి చేస్తూ.. తమ స్వాధీనంలో ఉన్న 1800 ఎకరాల భూములను గత ప్రభుత్వం అక్రమంగా వాన్‌పిక్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి ఆన్ లైన్ చేసిందని.. దాన్ని రద్దు చేసి దళితులమైన తమ పేరిట భూములను ఆన్‌లైన్ చేసి, భూ హక్కు కల్పించాలని వేడుకున్నారు.

కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన కె. పుల్లయ్య విన్నవించుకొంటూ.. తన పొలాన్ని ప్రతాప్ రెడ్డి అనే వ్యక్తి అక్రమించుకొని అక్రమంగా వెంచర్ వేసి గోడ కట్టాడని.. తనను తన పొలంలోకి వెళ్లనివ్వడంలేదని.. తన పొలాన్ని కబ్జా నుండి విడిపించి న్యాయం చేయాలని నేతలను వేడుకున్నాడు.

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామానికి చెందిన పలువురు బాధితులు విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామానికి చెందిన యర్రెద్దుల సుల్తాన్ అనే వైసీపీ నాయకుడు.. గత ప్రభుత్వంలో అధికారులను చెప్పుచేతల్లో పెట్టుకుని తమ స్వాధీనంలో ఉన్న వారసత్వ భూములను కబ్జా చేసి అక్రమంగా అతడి పేరుపై ఆన్ లైన్ చేసుకున్నాడని, దానిని రద్దు చేసి, తమకు భూమిపై హక్కులను కల్పించాలని వేడుకున్నారు.

ప్రకాశం జిల్లా కంభం మండలం తురిమెళ్ల గ్రామానికి చెందిన తోట రంగస్వామి అర్జీ ఇస్తూ.. ప్రభుత్వ దారిని ఆక్రమించిన కబ్జాదారులపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని.. అధికారులు కూడా అక్రమణదారులకు కొమ్ముకాస్తున్నారని.. ఆక్రమణ దారుల నుండి రహదారిని విడిపించి ప్రజా ప్రయోజనాలను కాపాడాలని కోరారు.

కృష్ణా జిల్లా మోపిదేవి మండలం మెల్లమర్తి లంక గ్రామానికి చెందిన కోనేరు వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేస్తూ.. తాను రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగినని.. తాను ఆర్మీలో పనిచేస్తుండగా.. తన ఆస్తులను తనకు తెలియకుండా అధికారులను మేనేజ్ చేసి తన తమ్ముడు సొంతం చేసుకున్నాడని..అతని నుండి తన ఆస్తులను విడిపించాలని వేడుకున్నాడు.

గవర కులస్తులమైన తాము బీసీ-డీలో ఉన్నందున రిజర్వేషన్ ఫలాలు పొందడంలో తమకు అన్యాయం జరుగుతోందని, తమ కులాన్ని బీసీ-ఏ లోకి మార్చి న్యాయం చేయాలని అంతర్జాతీయ గౌరీ సేన ఐక్య సమాఖ్య చైర్మన్ అడారి ఉమాశంకరరావు గ్రీవెన్స్‌లో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశాడు.







# స్వయంకృషి.. అందరి సహకారంతో ఈ స్థాయికి వచ్చా

- స్వచ్ఛతలో దేశంలోనే నెంబర్ 1గా ఏపీని తీర్చిదిద్దుతా
- సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ముందుకు
- నా తండ్రి విలువలతో కూడిన జీవితాన్ని నేర్పారు
- అదే నా ఎదుగుదలకు కారణం
- నేటి యువత ప్రశ్నించేతత్వాన్ని అలవరచుకోవాలి
- ప్రమాణ స్వీకార కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



అమరావతి (చైతన్యరథం): నేటి యువత సామాజిక స్పృహ కలిగి ఉండటంతోపాటు ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోవాల్సిన అవసరం ఉందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, వేలాది మంది అభిమానుల మధ్య సోమవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్‌గా కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ తన తండ్రి కొమ్మారెడ్డి దుర్గా ప్రసాద్ క్రమశిక్షణతో తనను పెంచారన్నారు. చిన్నప్పటి నుంచే పుస్తక పఠనం, పత్రికలు చదవటం గురించే కాకుండా దేశ, విదేశాల్లో జరిగే వర్తమాన విషయాలు చెప్పేవారన్నారు. స్వర్గీయ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు పై అభిమానంతో కుటుంబంలో అందరం టీడీపీ కోసం పనిచేసామన్నారు. పోలింగ్ బూత్ స్థాయి నుంచి పోలింగ్ ఏజెంట్ వరకు వివిధ స్థాయిల్లో తాను పనిచేసానన్నారు. నేటి యువతలో ఫైర్ అనేది లేకుండా పోతోందని, సమాజంలో జరిగే అన్యాయాలపై ప్రతి ఒక్కరూ ప్రశ్నించడంతోపాటు ఎదురొడ్డి పోరాడే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2012 లో ప్రారంభించిన పాదయాత్రతో తన రాజకీయ జీవితం ప్రారంభమైందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టిన నెల నుంచే రాష్ట్రాన్ని లూటీ చేయడం ప్రారంభించిందని, ప్రజలను అనేక రకాలుగా ఇబ్బందికి గురిచేయడంతో తన గళం వినిపించానన్నారు. తాను ఎప్పుడూ నిరాధారంగా, అసత్య ఆరోపణలతో మాట్లాడలేదని, వాస్తవాలను చూపిస్తూ ఘాటుగానే మాట్లాడానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడూ వాస్తవాలను మాట్లాడాలనే చెపుతారన్నారు. ఆయన చూపిన మార్గదర్శకత్వంలోనే ముందుకు వెళుతున్నామన్నారు. రాజకీయాల్లో ఎవరైనా రాణించగలుగుతారని, చదువుకున్న వారు కొద్దిసంఖ్యలో అయినా రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తనను తాను నిరూపించుకునేందుకు 12 సంవత్సరాల నుంచి కృషి చేస్తున్నానన్నారు. స్వయంకృషితో అందరి సహకారంతో ఈ స్థాయికి వచ్చానన్నారు. చెత్త నుంచి సంపద తయారీతోపాటు విద్యుత్ ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. వారం రోజులపాటు ఏదైనా గ్రామంలో చెత్త తీయడం మానేస్తే ఆ గ్రామంలో ఉండలేమన్నారు. గత పాలకులు చెత్తపైనా పన్ను వేశారన్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్ ద్వారా కేంద్రం నుంచి నిధులు ఎక్కువ వచ్చేలా కృషి చేస్తానన్నారు. రాజకీయ క్రీడా మైదానంలో మొన్నటి వరకు చెత్తను క్లీన్ చేశానని, నేడు రాష్ట్రాన్ని పరిశుభ్రంగా చేసే బాధ్యత ముఖ్యమంత్రి తనకు అప్పగించారని, ఈ బాధ్యత విజయవంతంగా నిర్వహించేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. వచ్చే అక్టోబర్ 2, గాంధీ జయంతి నాటికి దేశంలోనే స్వచ్ఛతలో రాష్ట్రాన్ని నెంబర్ 1 గా చేస్తానన్నారు.

పనిచేసిన వారిని సీఎం గుర్తిస్తారు: మంత్రి కొల్లు రవీంద్ర

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్‌గా పట్టాభి బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. యువత ను ప్రోత్సహించే విధంగా చంద్రబాబు పదవులు ఇస్తున్నారని, వచ్చే ముప్పై ఏళ్లల్లో యువత నిబద్ధతతో పని చేసేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. గత ఐదేళ్లలో జరిగిన అరాచకాలు అందరూ చూశారని, జగన్ ప్రభుత్వం పై ధైర్యంగా గళమెత్తిన వ్యక్తి పట్టాభి అన్నారు. ఇంటిపై దాడి చేసినా, అక్రమ అరెస్టు చేసినా భయపడలేదన్నారు. తనకు సంబంధం లేని కేసులో అరెస్టు చేసి 54 రోజులు తనను జైల్లో పెట్టారన్నారు. బుద్దా వెంకన్న, నాగుల్ మీరాలు గత పదేళ్లుగా ఎన్నో పోరాటాలు చేశారని, కమిట్మెంట్‌తో నిలబడి పనిచేసిన వారిని ముఖ్యమంత్రి తప్పకుండా గుర్తించి తగిన సమయంలో పదవులిస్తారన్నారు. ప్రధాని, సీఎంలకు ఇష్టమైన అంశం స్వచ్ఛ సంకల్ప్ అని, వారి సారథ్యంలో పట్టాభి మంచి పని తీరుతో ప్రజలకు సేవ చేస్తారని మంత్రి కొల్లు రవీంద్ర ఆకాంక్షించారు.

### ఎన్ని ఇబ్బందులు పెట్టినా భయపడలేదు: మంత్రి కొండపల్లి



రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐల శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వ అరాచకాలను పట్టాభి ధైర్యంగా ఎదిరించారన్నారు. గత ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా భయపడలేదన్నారు. కమిట్‌మెంట్‌తో పని చేసిన పట్టాభికి ఈ పదవి ఇవ్వడం చాలా ఆనందం కలిగించిందన్నారు. పార్టీ కోసం పని చేసే వారిని అధిష్టానం తప్పకుండా గుర్తిస్తుందన్నారు. పట్టాభికి అప్పగించిన పదవిలో విజయవంతంగా, తనదైన శైలిలో ప్రజలకు సేవలు అందిస్తారని ఆశిస్తున్నానని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.

### అరాచకాలకు ఎదురొడ్డిన పట్టాభి: వర్ల

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఆర్టీసీ మాజీ ఛైర్మన్ వర్ల రామయ్య మాట్లాడుతూ గత 5 ఏళ్లలో ప్రజలందరూ ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు.



ఆ అరాచకాలకు ఎదురొడ్డి నిలబడిన వ్యక్తి పట్టాభిరామ్ అన్నారు. రాష్ట్రమంతా నిండిపోయిన బురద, చెత్తను తొలగించడానికి ముఖ్యమంత్రి ఒక మంచి పనిని పట్టాభికి అప్పగించారన్నారు. వ్యక్తిగతంగా దాడిచేసినా, తన ఇంటిపై దాడి చేసినా పట్టాభిలో పోరాట పటిమ తగ్గలేదని, మొక్కవోని ధైర్యంతో ముందుకు వెళ్లారని వర్ల రామయ్య అన్నారు.

### పట్టాభి అన్ని విధాలా అర్హుడు: ఎమ్మెల్యే బొండా



విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్‌గా అన్ని అర్హతలు ఉన్న వ్యక్తి పట్టాభిరామ్ అన్నారు. దీనికన్నా ఇంకా మంచి పదవికి కూడా పట్టాభికి అర్హత ఉందని, పరిస్థితులు బట్టి అధిష్టానం పట్టాభికి ఈ కీలక బాధ్యతలు ఇచ్చిందన్నారు.

### దాడులు తట్టుకుని నిలబడ్డ పట్టాభి: ఎమ్మెల్యే ఆనంద్‌బాబు



వేమూరు శాసనసభ్యుడు నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ గత ఐదేళ్లల్లో పట్టాభి చాలా బాగా పని చేశారన్నారు. గత ప్రభుత్వ అరాచకాలపై గళం విప్పారన్నారు. ఎన్నో దాడులు, తిట్లు తట్టుకుని ధైర్యంగా నిలబడి పోరాడిన పట్టాభిని అభినందించారు.

ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్సీ అశోక్ బాబు, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్, గద్దె రామ్మోహన్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, పార్టీ నాయకులు మన్నవ మోహన్ కృష్ణ, నాగుల్ మీరా, మాల్యాద్రి, బాలకోటయ్య, రఫీ, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.












## ఏపీకి వచ్చేందుకు ఆసక్తిగా కంపెనీలు

**- పారిశ్రామిక పార్కుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం**
**- అసెంబ్లీలో మంత్రి టీజీ భరత్**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని పారిశ్రామిక పార్కుల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ తెలిపారు. శాసనసభలో సోమవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అడిగిన ప్రశ్నలకు మంత్రి భరత్ సమాధానం ఇచ్చారు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం, మల్లవల్లిలో 1,360 ఎకరాల్లో మోడల్ ఇండస్ట్రియల్ పార్క్, 100 ఎకరాల్లో మెగా ఫుడ్ పార్క్, స్టేట్ ఫుడ్ పార్కును ఏర్పాటు చేయడం కోసం ఏపీఐఐసీ భూమిని సేకరించిందన్నారు. మల్లవల్లి పారిశ్రామిక పార్కులో భూ వివాదాలు లేని ప్రాంతాల్లో బీటీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలను ఏపీఐఐసీ కల్పించిందన్నారు. ఇక పారిశ్రామిక పార్కు యూనిట్లలో పనిచేస్తున్న ఉద్యోగుల సౌకర్యార్థం ఏపీఎస్ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేసిందన్నారు. నీటి సరఫరాకు సంబంధించి 20 కిలోమీటర్లు దూరం పనులు త్వరలో పూర్తిచేస్తామని మంత్రి భరత్ తెలిపారు.

గత ప్రభుత్వంలో ఏపీ నుండి వెళ్లిపోయిన అశోక్ లేలాండ్ మళ్ళీ రాష్ట్రానికి రావడంతో పాటు ఉన్న కంపెనీని మరింత విస్తరించే ఆలోచనలో ఉందన్నారు. దీంతో పాటు ఇతర కంపెనీలు కూడా ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. మల్లవల్లి పారిశ్రామిక పార్కులో 9 పెద్ద కంపెనీలు వచ్చాయన్నారు. మల్లవల్లి పారిశ్రామిక వాడలో పోలీస్ ఔట్ పోస్టు, ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక పార్కుల వద్ద ఆర్చ్‌లు ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న భూములను కూడా తీసుకునేందుకు చర్చిస్తామన్నారు. ఇక పారిశ్రామిక పార్కుల్లో భూవివాదాలు పరిష్కరించేందుకు లీగల్ విభాగాన్ని ఏర్పాటుచేయనున్నట్లు మంత్రి తెలిపారు.

## పోలవరం జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన ఏపీ ఈఆర్‌సీ ఛైర్మన్

**- పనుల పురోగతిని వివరించిన జెన్‌కో డైరెక్టర్ సుజయ కుమార్**

పోలవరం (చైతన్యరథం): పోలవరం జల విద్యుత్ కేంద్రాన్ని సోమవారం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీ ఈఆర్‌సీ ) ఇన్‌ఛార్జి ఛైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్ సందర్శించారు. ఆయన వెంట కమిషన్ సభ్యుడు పీ వెంకట రామరెడ్డి ఉన్నారు. పోలవరం బహుళార్థసాధక ప్రాజెక్ట్ నుంచి జల విద్యుత్ కేంద్రానికి నీటిని తరలించేందుకు నిర్మిస్తున్న కాలువ, విద్యుత్ కేంద్రం సర్వీస్ బే, ఇతర నిర్మాణాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఆర్‌సీ ఛైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్ కు జల విద్యుత్ కేంద్రం పనుల పురోగతిని ఏపీ జెన్ కో హైడల్ విభాగం డైరెక్టర్ సుజయ కుమార్, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్ ) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) అంగర సతీష్ బాబు వివరించారు. పోలవరం జల విద్యుత్ కేంద్రాన్ని నిర్దేశిత సమయానికి పూర్తి చేయాల్సిందిగా నిర్మాణ సంస్థ ఎంఈఐఎల్‌ను కోరామని, సంస్థ అందుకు అనుగుణంగా పనులు చేస్తోందని వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రణాళికా బద్ధంగా సివిల్, ఎలక్ట్రో, మెకానికల్ పనులు చేస్తున్నామని ఎంఈఐఎల్ సీఓఓ సతీష్ బాబు తెలిపారు. ప్రాజెక్ట్ పనుల పట్ల ఛైర్మన్ సంతృప్తి వ్యక్తం చేశారని అధికారులు తెలిపారు. ఛైర్మన్ వెంట ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ (సివిల్) వై కోటేశ్వర రావు, ఎస్ఈ లు రామభద్ర రాజు, రవీంద్ర రెడ్డి, చంద్రశేఖర్, ఈఈ లు హనుమ, ప్రభాకర రావు, భీమాదానరావు, సీతారాం, వ్యాప్కోస్ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ కొలగాని మూర్తి, పోలవరం హైడెల్ ప్రాజెక్ట్ ఎంఈఐఎల్ జనరల్ మేనేజర్ శంకర్, తదితరులు ఉన్నారు.

## వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడపై కేసు



టెక్కలి (చైతన్యరథం): శ్రీకాకుళం జిల్లాకు చెందిన వైసీపీ నాయకుడు, ప్రస్తుతం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై కేసు నమోదైంది. తమ పార్టీ అధినేత, ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై దువ్వాడ అసభ్యకర వ్యాఖ్యలు చేశారని, వినలేని మాటలు మాట్లాడారని టెక్కలి నియోజకవర్గ జనసేన నాయకుడు కణితి కిరణ్ కుమార్ ఫిర్యాదు చేశారు. దీంతో దువ్వాడపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేశారు.

# వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల ప్రసక్తే లేదు

- ❑ గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో విద్యుత్ రంగంపై రూ.1.29 లక్షల కోట్ల భారం
- ❑ పీపీఏలు రద్దు తగదని కేంద్రం చెప్పినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు
- ❑ పీపీఏల రద్దు వల్ల పెట్టుబడులు వెనక్కి వెళ్తాయన్నా వినలేదు
- ❑ వైసీపీ హయాంలో మెగావాట్ విద్యుత్ కూడా అదనంగా ఉత్పత్తి చేయలేదు
- ❑ విద్యుత్ వ్యవస్థను గాడిన పెట్టేలా కూటమి ప్రభుత్వం చర్యలు
- ❑ మండలిలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి గొట్టిపాటి జవాబు



అమరావతి (చైతన్యరథం): వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రసక్తే లేదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. శాసనమండలిలో సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో పలువురి ప్రశ్నలకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమాధానమిచ్చారు. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల కారణంగా విద్యుత్‌రంగ సంస్థలపై సుమారు రూ.1.29 లక్షల కోట్ల భారం పడిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పీపీఏల రద్దు అంశం చాలా వివాదాస్పదం అయినట్లు మంత్రి పేర్కొన్నారు. పీపీఏల రద్దు కారణంగానే పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయినట్లు పేర్కొన్నారు. నాడు జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం సరైనది కాదని కేంద్ర ప్రభుత్వం స్వయంగా లేఖ రాసిన విషయాన్ని మంత్రి గొట్టిపాటి గుర్తు చేశారు. ప్రతీ ఏడాది వినియోగదారుల సంఖ్య 5 నుంచి 6 శాతం పెరుగుతున్నప్పటికీ జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో కొత్తగా ఒక్క మెగావాట్ విద్యుత్‌ను కూడా ఉత్పత్తి చేసిన పాపాన పోలేదని విమర్శించారు. గత ఐదేళ్లలో అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ వ్యవస్థను గాడిన పెట్టేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కూటమి ప్రభుత్వం గ్రీన్ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీకి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. ఇందుకోసం ఏకంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పాలసీ తీసుకొచ్చిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఈ పాలసీ కారణంగా రాష్ట్రానికి క్రమంగా పెట్టుబడులు వస్తున్నాయన్నారు.

గత ప్రభుత్వం తీసుకుని వచ్చిన చట్టంలోని లోపాలను సరిదిద్దే ప్రయత్నంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సుంకం (రెండో సవరణ), 2024 బిల్లు తీసుకువస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. ఈ సవరణ వల్ల వినియోగదారులపై కొత్తగా అదనపు భారం గానీ, విద్యుత్ సుంకం కానీ విధించడం లేదని స్పష్టం చేశారు. ఈ బిల్లును వైసీపీ ప్రభుత్వం 2021 లోనే తీసుకుని వచ్చినా... సుంకం విధించే విషయంపై ఎక్కడా స్పష్టత ఇవ్వలేదని పేర్కొన్నారు.

2014లో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టే నాటికి విద్యుత్ అంతరాయాలు ఏపీలో ఎక్కువగా ఉండేవని మంత్రి గొట్టిపాటి తెలిపారు. విద్యుత్ వినియోగానికి జరిమానాలు వేసిన విషసంస్కృతి ఉండేదని దుయ్యబట్టారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి ఒక్క రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచకుండా పాలించిన ప్రభుత్వం తమదని మంత్రి పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు అధికారం నుంచి దిగిపోయే నాటికి ఈఆర్సీకి కేవలం రూ. 3 వేల కోట్ల మాత్రమే అప్పు ఉన్నట్లు మంత్రి గొట్టిపాటి గుర్తు చేశారు. జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత 2022-23 ఏడాదికి రూ. 6 వేల కోట్లు అప్పు ఉన్నట్లు చూపించారని పేర్కొన్నారు. దీనితో పాటు 2023-24 ఏడాదికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు స్పష్టం చేశారు. మొత్తంగా రూ. 17 వేల కోట్లు ప్రజలపై భారం వేయాలని వైసీపీ ప్రభుత్వం ప్రయత్నించిందని మండిపడ్డారు. వైసీపీ పాలనలో విద్యుత్ రంగం సర్వనాశనం అయిందని గ్రహించిన ప్రజలు వారిని 11 సీట్లకే పరిమితం చేశారని మంత్రి ధ్వజమెత్తారు.

సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు..

## పోసానిపై సీఐడీ కేసు



అమరావతి (చైతన్యరథం): సినీనటుడు పోసాని కృష్ణమురళి పై ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. రాష్ట్ర తెలుగు యువత ప్రతినిధి బండారు వంశీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. వైసీపీ హయాంలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌లపై పోసాని అసభ్యకరరీతిలో వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పోసానిపై ఇప్పటికే పలు కేసులు నమోదవగా తాజాగా పోసాని కృష్ణ మురళిపై ఏపీ సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ ఏడాది సెప్టెంబరులో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబుపై పోసాని అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అసత్య ప్రచారానికి దిగారని సీఐడీ పోలీసులకు బండారు వంశీకృష్ణ ఫిర్యాదు చేశారు. చంద్రబాబు వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పోసాని వ్యాఖ్యానించారని, సమాజంలోని వివిధ వర్గాల మధ్య విభేదాలు సృష్టించేలా వ్యాఖ్యానించిన పోసానిపై చర్యలు తీసుకోవాలని వంశీకృష్ణ కోరారు. దీంతో, పోసానిపై 111, 196, 353, 299, 336 (3) (4), 341, 61(2) బీఎన్ఎస్ సెక్షన్ల ప్రకారం సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. కాగా, చంద్రబాబు, పవన్, లోకేష్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ రాష్ట్రంలోని పలుచోట్ల పోసానిపై పోలీసులకు ఫిర్యాదులు అందాయి. పవన్, లోకేష్‌ల గురించి చేసిన వ్యాఖ్యలకుగానూ కడప జిల్లా రిమ్స్ పోలీస్ స్టేషన్‌లో టీసీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకట సుబ్బయ్య ఫిర్యాదు చేశారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు గురించి పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారని రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు వచ్చాయి. పోసానిపై చర్యలు తీసుకోవాలంటూ పలు పోలీస్ స్టేషన్‌లలో టీడీపీ శ్రేణులు ఫిర్యాదులు చేశాయి. అనంతపురం, బాపట్ల, పల్నాడు జిల్లా నరసరావుపేట, చిత్తూరు, తిరుపతి ,కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లోనూ ఆయనపై ఫిర్యాదులు అందాయి.




## ఏడు కీలక బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

అమరావతి (చైతన్యరథం): ఏడు కీలక బిల్లులకు ఏపీ శాసనసభ సోమవారం ఆమోదం తెలిపింది. ఏపీ పంచాయతీరాజ్ సవరణ బిల్లు-2024, ఏపీ మున్సిపల్ సవరణ బిల్లు-2024, ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ నిరోధక బిల్లు-2024 తదితర ఏడు కీలక బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఎంతమంది పిల్లలున్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించేలా నిబంధనలు మారుస్తూ తీసుకొచ్చిన బిల్లు సభ ఆమోదం పొందింది.

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ సవరణ బిల్లు-2024, ఆయుర్వేదిక్ హోమియోపతి మెడికల్ ప్రాక్టిషనర్స్ చట్ట సవరణ, ఏపీ మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ చట్ట సవరణ బిల్లు-2024 బిల్లులను శాసనసభ ఆమోదించింది. వీటితోపాటు ఏపీ సహకార సంఘం సవరణ బిల్లు-2024నూ శాసనసభ ఆమోదించింది. అనంతరం స్పీకర్ అయ్యన్న పాత్రుడు శాసనసభను మంగళవారానికి వాయిదా వేశారు.

## భక్త కనకదాసకు మంత్రుల ఘన నివాళి



అమరావతి (చైతన్యరథం) : సామాజిక తత్వవేత్త, సంగీత విద్వాంసుడు, ఆధునిక కవి భక్త కనకదాస జయంతి సందర్భంగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వెలగపూడిలోని అసెంబ్లీ హాలులో కనకదాస జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదాస జీవిత విశేషాలను, రాయలసీమలో కుల వ్యవస్థ, అసమానతలపై తన కీర్తనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన విధానాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, బీసీ జనార్థన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్‌తో పాటు శాసనసభ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, విప్ కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, కందికుంట వెంకట ప్రసాద్ సహా పలువురు ఎమ్మెల్యేలు, అసెంబ్లీ సెక్రటరీ సూర్యదేవర ప్రసన్నకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

